# నీలాంటి ఒకరు

అదొక ఆఫీసు—వివరాలు అనవసరం. ఆఫీసరు గదిలో, ఆఫీసరు ముందు లక్ష్మీపతి కూర్చుని వున్నాడు. ఇంటర్వ్యూ జరుగుతోంది.

'నీ పేరు ?' అన్నాడు ఆఫీసరు.

'లక్ష్మీపతి' నా పేరులో పేరడీ వుంది. నేను అతి పేదవాడిని. స్కాలర్ షిప్పుమీద, వారాలు చదివి బి. ఎ. పాసయ్యాను. ఫస్టుక్లాస్. రెండేళ్ళయింది. ఇంతవరకూ ఉద్యోగం లేదు. ఎన్నోచోట్ల ప్రయత్నించేను. రాలేదు. ఉద్యోగం లేకపోతే బ్రతకలేను' అన్నాడు లక్ష్మీపతి.

తన అర్హతలు చెప్పేడు. తన ప్రవర్తనవల్ల సంతృప్తి ప్రకటించిన పెద్దల సర్టిఫికేట్లు చూపించేడు.

ఆఫీసరు కుర్రవాడు, గుణవంతుడు, యోగ్యుడు. లక్ష్మీపతి ఆఫీసరుకి నచ్చేడు. మరుక్షణంలో స్టెనోని పిలిచేడు. అపాయింటుమెంట్ ఆర్డర్ను డిక్టేట్ చేస్తున్నాడు. లక్ష్మీపతి కళ్ళల్లో వెయ్యి జ్యోతులు వెలుగుతున్నాయి.

ఇంతలో - ఆఫీసరు టేబిల్ మీదున్న ఫోన్ మోగింది.

ఎత్తుకున్నాడు. అయిదు నిమిషాలు తొట్రుపాటుతో మాట్లాడేడు. ఆ ఉద్యోగం ఒక కుర్రాడికిచ్చేనన్నాడు. అతను గ్రాడ్యుయేటూ, యోగ్యుడూ అనికూడా అన్నాడు. ఆరో నిమిషంనుంచి ఆఫీసరు మాటలాపి ఫోన్లో వింటున్నాడు. క్షణ క్షణం ఆఫీసరు మొహం కళావిహీనం కావడం లక్ష్మీపతి పసి గట్టేడు. భయపడుతున్నాడు. ఆఫీసరు ఫోన్ పెట్టి మొహమ్మీద పట్టిన చిరుచెమట్లను తుడుచుకున్నాడు. స్టెనోని వెళ్ళిపొమ్మన్నాడు. హీన స్వరంలో లక్ష్మీపతితో చెప్పేడు.

'అయాం సారీ! సో సారీ! పేరుకి ఆఫీసర్నే. కొన్ని అజ్ఞాత శక్తుల చేతుల్లో బొమ్మను. నాకు చాలా ఫోన్ కాల్స్ వస్తుంటాయి. కొన్ని కాల్స్‌ని నేను గౌరవించాలి. ప్రభుత్వంలో పలుకుబడి వున్న ప్రతి మనిషికీ నేను బానిసను. వ్యక్తిత్వం - ఈ ఉద్యోగం రాకముందు - వుండేది. ఇప్పుడు లేదు. వుంచుకుంటే కష్టాలు కొని తెచ్చుకున్నట్టవుతుంది. చూస్తూ చూస్తూ ఈ సుఖాన్ని జారవిడుచుకోలేను. మీ కిచ్చిన ఉద్యోగం పోయింది. అది వేరేమనిషికి - యోగ్యత లనవసరం - ఇవ్వాలి. ఇస్తాను. గుడ్ బై మై డియర్ ఫ్రెండ్ - ప్లీజ్ గో.

లక్ష్మీపతి లేచి నించున్నాడు. రెండు చేతులూ జోడించేడు. మనసులో సుళ్ళు తిరుగుతున్న భావాల్ని స్పష్టంగా చెప్పేడు.

'నాకు ఉద్యోగం పోయినందుకు బాధలేదు. మీ మీద జాలిగావుంది. ఫోన్‌కున్న విలువ మనిషికిలేదు. సార్,

మీ ఫోన్‌కి గోల్డ్‌మలామ్ చేయించండి. అది చెక్కముక్క కాదు. ఒక జీవితాన్ని నిలబెట్టే బంగారపు కణిక. వస్తాను సార్ .... నమస్కారం.

—లక్ష్మీపతి ఉద్యోగ ప్రయత్నాలు విరమించలేదు. చాలా ఆఫీసులు తిరుగుతున్నాడు. ఫలితం కనుపించలేదు. నిరాశా, నిరుత్సాహం అధిక మవుతున్నాయి.

అద్దె గదివేపు నడుస్తున్నాడు ...

పెద్ద ఆవరణలో ఆరేడు కొంపలు కట్టించి, వాటిని అద్దెకివ్వడం ఒక వ్యాపారం. లోకనాథం ఆ వ్యాపారం చేస్తున్నాడు. అతను ఒకేచోట కట్టించిన ఆరేడు కొంపలూ హిందూదేశానికి స్పెసిమను. ఒక్కో కొంపలో ఒక్కో చరిత్ర. ఆ కొంపల్లో, ఒక చిన్న గదిలో లక్ష్మీపతి అద్దె కుంటున్నాడు. గదికొచ్చి, మంచినీళ్ళుతాగి, ఒక బౌండ్ పుస్తకం తీశాడు. దాన్లో ఆరోజు జరిగిన ముఖ్యాంశాలు రాసుకున్నాడు. రాయడం పూర్తయిన తర్వాత పుస్తకం మూసేడు. తలెత్తి చూసేడు. ఎదట ఇంటి యజమాని లోకనాథం నిలబడి వున్నాడు.

'ఏమిటయ్యా రాస్తున్నావ్ ?'

'ఆత్మకథ. నా కథ రాసుకుంటున్నాను.'

లోకనాథం నవ్వేడు. చాలా అసహ్యంగా, ఎగతాళిగా వుందా నవ్వు. లక్ష్మీపతి తల వంచుకున్నాడు. నవ్వు పూర్తయింతర్వాత, లోకనాథం లక్ష్మీపతిని తిట్టేడు. ఈ

జోడి రాతలు డబ్బులిస్తాయా ? ఇవ్వవు. డబ్బు గడించని ఏపని చేసినా పాపమే ! అద్దె కట్టలేని వెధవ్వి నీకీ రాత లెందుకు ? ఉద్యోగం వస్తుందన్నావ్. ఉద్యోగ ప్రయత్నం మాని జేబులు కత్తిరించడం ప్రారంభిస్తే నాలుగేళ్ళలో ఇల్లు కట్టించేవచ్చు. కత్తిరికి పెట్టుబడి నేను పెడతాను. మంచి రోజు చూసుకుని వృత్తి మొదలుపెట్టు — అంటూ చాలా నీచాతి నీచంగా మాట్లాడేడు. ఇవాళ సాయంత్రం అద్దె కట్టక పోతే మెడపెట్టి గెంటించవలసి వస్తుందని అల్టిమేటమ్ ఇచ్చేడు. వెళ్ళిపోయేడు.

లక్ష్మీపతి కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి. గదికి తాళంవేసి బయటకు వచ్చేడు. అద్దెకొంపల్లోని జనం లక్ష్మీపతిని చుట్టు ముట్టేసేరు. ఏం జరిగిందని అడిగేరు. తానేమీ చెప్పక పోయినా, జనమే తలో మాటా ఊహించి అన్నారు. వాళ్ళన్న ప్రతి మాటకీ 'అవును, అల్లాగే జరిగింద'ని సమాధానం చెప్పేడు లక్ష్మీపతి. కొందరు ఓదార్చేరు, నిజంగా కాదు — మాటల్లో మాత్రమే. కొందరు నవ్వుకున్నారు.

లక్ష్మీపతి తన కష్టాలతోపాటు — ఈ చిన్ని ప్రపంచంలో కాపుర ముంటున్న వివిధరకాల మనుషుల్నీ, వాళ్ళ మనస్తత్వాల్నికూడా ఓర్చుకోడం నేర్చుకున్నాడు. రాను, రాను తనలో సహనం చచ్చిపోతున్నట్టు గమనిస్తున్నాడు.

అతను రోడ్డుమీదికి వచ్చేడు. రోడ్డు ప్రక్కన చిలక జోస్యం చెబుతున్నాడొకడు. అతన్ని చూడగానే, తన జాతకం ఎల్లావుందో తెలుసుకోవా లనుకున్నాడు. వెళ్ళి,

అతని ముందు కూర్చున్నాడు. పది పైసలిచ్చి ఆత్రంగా చూస్తున్నాడు.

చిలక కార్డు లాగింది. కార్డుచూసి జోస్యం చెప్పేడు. లక్ష్మీపతికి, అతని రాబోయే పుట్టినరోజున - ఒక గొప్ప మార్పు జరుగుతుందన్నాడు. అది మేలో, కీడో చెప్పలేకుండా వున్నా నన్నాడు.

'రేపే నాపుట్టినరోజు' అన్నాడు లక్ష్మీపతి. అయితే, రేపే అది అనుభవానికి వస్తుందన్నాడు చిలకమనిషి. లక్ష్మీపతి లేచేడు. కాలుని జాడించి నడుస్తున్నాడు.

ఊరంతా - తిరిగి, తిరిగి చీకటి పడుతున్న వేళకి గది వేపు బయలుదేరేడు. చీకటి పడుతున్న శుభసందర్భాన నగరం అలంకరణాలు చేసుకొంటోంది.

లక్ష్మీపతి గదికి చేరుకున్నాడేగాని - గదిలోకి వెళ్ళ లేదు. గదిముందు పచార్లు చేస్తున్న లోకనాథాన్ని చూసి ఆగిపోయేడు. అతనిచ్చిన అల్టిమేటమ్ గుర్తుకొచ్చింది. అద్దె కొంపల్లో వున్న చిన్ని ప్రపంచం తన శరీరం తూట్లు పడేలా అనే ఎగతాళి మాటలూ - చూసే చూపులూ గుర్తుకొచ్చేయి. లక్ష్మీపతి భయపడ్డాడు. లోకనాథానికి కనిపించకుండా అక్కడ్నుంచి తప్పుకున్నాడు. కొంత దూరం నడిచి, ఆ తర్వాత పరుగు ప్రారంభించేడు నగరంలోకి — రాత్రిలోకి.

రాత్రి ఆ నగరం చాలా బిజీగా వుంది. అటు సామా

న్యూడిన్ని, ఇటు ఖరీదైన మనిషిని అలరించేందుకు సర్వ సన్నా హాలతో మిడిసిపడిపోతుంది నగరం.

పరుగువల్ల కలిగిన అలుపులో లక్ష్మీపతి ఒకచోట ఆగిపోయేడు. ఆగిచూసేడు. ఒక పక్క సినిమా హాల్సూ - మరోపక్క బార్లూ. ఒకపక్క ఖరీదైన హోటళ్లూ క్లబ్బులూ- ఇంకో పక్క ఎమ్యూజ్మెంట్ పార్కులూ. వీటన్నింటికీ ఎగ బడే మనుషులు. వాటికోసం వెచ్చించే డబ్బూ వగైరా- ఇవన్నీ తలచి లక్ష్మీపతి నిట్టూర్చేడు.

ఇంత నగరంలో తానొక్కడే దౌర్భాగ్యుడు. తానొ క్కడే ఏ ఆనందానికీ నోచుకోని దురదృష్టవంతుడు. తానొ క్కడే. తానొక్కడే.. 'ఛీ .. ఛీ .. వెధవ బ్రతుకు. కాసేపు నిశ్చింతగా విశ్రాంతి పొందడానికూడ వీల్లేని పాడు బ్రతుకు' అనుకున్నాడు.

అతనికి ఆకలివేసింది. జేబులో చెయ్యి పెట్టేడు. రూపా యికాగితం దొరికింది. చివర్రూపాయి. అది తీసుకుని దాని మీద - చివర్రూపాయి, నిరుద్యోగి - అనిరాసుకుని - దాంతో బఠాణీలు కొనుక్కున్నాడు. దగ్గర్లో ఒక పెంకుటిల్లు కనుపిం చింది. ఆ ఇంటి అరుగుమీద కూచుని ఒక్కొక్క బఠాణీ తింటున్నాడు.

బఠాణీలు అయిపోతుండగా - ఆ ఇంట్లో ఒక వింతైన అల్లరిని అతను పసిగట్టేడు.

ముసలి మొగుడు. కుర్ర పెళ్లాం. అతనికి నాలుగో పెళ్లి.

ఆమెకు రెండో పెళ్లి. ఆమె టీచరుద్యోగం చేస్తోంది. ఆమెను చదివించి ఆ ఉద్యోగం వేయించాడు, మొగుడు. వాళ్లిద్దరూ ఆరాత్రి తియ్యగా గడపాలి. కానీ, గడపలేదు. వయసుతో పాటు వాళ్ల మనసులూ అనుకూలంగా లేవు. ఆమెకు తన భర్త యొక్క మొదటి ముగ్గురు పెళ్లాలు గుర్తుకొస్తారు. ఇప్పుడు వాళ్లెవరూ లేరు - చచ్చిపోయారు. అతనికి ఆమె మొదటి మొగుడు ఇప్పుడెక్కడున్నాడో తెలీదు, గుర్తుకొస్తాడు. వాళ్ల వివరాలు చెప్పుకోవడం ప్రారంభించి - గొడవ పడతారు. అదొక యుద్ధంలా పరిణమిస్తుంది. ఆ యుద్ధంలో వాళ్లిద్దరూ అలిసిపోయి నిద్రకుపక్రమించేరు. పడుకునేముందు, ఆమె అడిగింది 'నన్నెందుకు పెళ్లి చేసుకున్నా'వని. దానికి అతనన్నాడు.

'నా బతుక్కి నువ్వొక పెట్టుబడివి, ఈ వయసులో నన్ను పోషించేందుకు వెనకాముందూ ఎవరూ లేరు. అందుకే నిన్ను చేసుకున్నాను. చదివించేను, ఉద్యోగం వేయించేను. నన్ను పోషించు. అది నీ కర్తవ్యం. నేను బతకాలి, అంతే. నిద్రపో. ఆమె ఏడుస్తూ నిద్రపోయింది.

ఆ అరుగుమీాద లక్ష్మీపతికూడా నిద్రలోకి జారుకున్నాడు. నిద్ర అతనికొక అందమైన కలని ప్రసాదించింది. కలలో మరింత అందంగా వున్నాడు. స్కూటరుమీాదున్నాడు. ఏడంతస్థుల ఆఫీసుముందు స్కూటరు ఆగింది. ఆ ఆఫీసులో అతనిది మంచి ఉద్యోగం. మర్యాదగల ఉద్యోగం. అది పూర్తయింతర్వాత. స్కూటరుమీాద ఇంటికి వచ్చేడు.

భార్య తన కోసం ఎదురు చూస్తోంది. ఆమె అతన్ని ప్రేమగా రిసీవు చేసుకుంది, కాఫీ ఇచ్చింది. ఇద్దరూ ముస్తాబై స్కూటరెక్కారు. అందంగా పాడుకుంటూ షికారు బయలుదేరేరు. పాట చివర్లో స్కూటరుకి ఘోరమైన ఏక్సిడెంట్ జరిగింది. లక్ష్మీపతి కెవ్వున అరిచేడు.

కల చెరిగి పోయింది, కళ్ళు విప్పి చూసేడు. దడదడ లాడే గుండెల్ని చేతుల్లో రాసుకున్నాడు. కలలోగూడా, తన జాతకం ఆనందమయం కానందుకు విసుక్కున్నాడు.

రాత్రి తెల్లవారబోతోంది.

నగరం నడిబొడ్డుమీద పెద్దక్లాక్ టవరుంది. నాలుగైదు తాటిచెట్లంత ఎత్తుంటుంది టవరు. దానిమీద పెద్ద గడియారం, అది కొట్టే గంటలు నగరంలో చాలా భాగం వరకూ వినిపిస్తుంది. టవరు ఎక్కి నిలబడితే ఊరు ఊరంతా కనిపిస్తుంది.

క్లాక్ టవర్ నుంచి నాలుగు గంటలు వినిపించేయి. లక్ష్మీపతి లేచి నిలబడ్డాడు. ఈ వేళప్పుడు లోకనాథం తన గది దగ్గర వుండడనుకున్నాడు. ఇల్లా, ఎన్నాళ్ళు లోకనాథాన్ని తప్పించుకు తిరగాలో, ఎన్ని అరుగులమీద నిద్రపోవాలో, ఎన్నేళ్లు ఈ బాధలను భరించాలో అతనికి తట్టిందికాదు. కోపం వచ్చింది. విసురుగా నడుస్తున్నాడు. అశాంతితో నడుస్తూ, దార్లో అతనో నిర్ణయానికి వచ్చేడు. ఆత్మహత్య చేసుకోవాలి !

గదికి వచ్చేడు. అందరూ నిద్రపోతున్నారు. గది

ముందు లోకనాథం లేడు. తెల్లవారితే మళ్లా వస్తారు. చిన్న ప్రపంచం మేల్కొంటుంది. వాళ్ళ సమక్షంలో లోకనాథం తనని తిట్టిపోస్తారు. అవమానిస్తారు. ఇవేమీ జరక్కముందే ఆత్మహత్య చేసుకోవాలి. అవమానాలకూ, కష్టాలూ కన్నీళ్ళకూ, అసహ్యమైన ఈ బ్రతుక్కీ దూరమైపోవాలి.

తాళం తీసేడు. గదిలోకి వెళ్ళి గడియ పెట్టుకున్నాడు. తలుపులమీద వాలి గదంతా చూసేడు. ట్రంకుపెట్టే, మాసిపోయిన బట్టలూ, పాత కూజా-దానిమీద సత్తుగ్లాసు కొన్ని పాత పేపర్లు. ఎన్నాళ్ళయిందో గది ఊడ్చి....

స్నానం చేశాడు. శుచిగా వున్నాడు. కొత్త బట్టలు కట్టుకున్నాడు. కుంకుమబొట్టు పెట్టుకున్నాడు. దేవుడు ముందు నిలబడ్డాడు. చేతులు జోడించేడు.

క్లాక్ టవర్ ఆరుగంటలు కొట్టింది.

"రేపీ వేళకు ఈ ఆరుగంటలు నాకు వినిపించకూడదు. రేపుదయం నే చూడకూడదు. ఇవాళ నా పుట్టిం రోజు. ఇవాళే నే చచ్చేరోజుగా చెయ్యి. లోగడ, నువ్వు నాకు చాలా విషయాల్లో అనుకూలించలేదు. నిన్నందుకు తిట్టను. కనీసం, ఈ విషయంలోనైనా సహకరించి నాచేత గౌరవం పొందు. లేకపోతే నీ మర్యాదా దక్కదు. సెలవు" అన్నాడు.

ఉరికి ఏర్పాట్లు చేసుకుందామనుకున్నప్పుడు అతని కంటికి ఆత్మకథ పుస్తకం కనిపించింది. అది చేతుల్లో వుంచుకుని దేవుడితో అన్నాడు—

"ఏ ముహూర్తాన ఈ ఆత్మకథ రాయడం ప్రారంభిం

చేనోగాని, దీన్లో ఏ పేజీ చదువు అన్నీ కష్టాలే! సుఖం దొరక్కపోతుందా అనే ఆశతో పేజీలు నింపేసుకుంటూ వచ్చేను. అప్పుడే మూడొంతుల పేజీలు పూర్తయిపోయేయి. సుఖం మాత్రం ఎండమావైపోయింది. మిగతా పేజీలు నింపే ఓపిక లేదు. ఆ ప్రయత్నం చేసినా కన్నీళ్ళు కష్టాలే రాయాలి. అవమానాలు, అనాదరణా ఇవే రాయాలి. చేదు బ్రతుక్కి ఇన్ని పేజీలు వృధా చేయడం నా కిష్టంలేదు. ఈ పుట్టినరోజుతో ఆత్మహత్య చేసుకుని నా ఆత్మకథకి చుక్క పెట్టేస్తున్నాను."

అవే ముక్కలు ఆత్మకథలో ఒక పేజీ మీద రాసేడు. సంతకం పెట్టేడు. పుస్తకం కిందపెట్టి గుంజకి తాడు బిగిస్తున్నాడు.

ఆ పక్క ఇంట్లో గొడవ జరుగుతోంది. ఒక గుమస్తా తన భార్యని కాఫీ అడిగేడు. ఆవిడ లేదు అన్నది. పొద్దున్నే దరిద్రగొట్టుమాట 'లేదా' ఏమిటని విసుక్కున్నాడు. బతుకులే దరిద్రగొట్టువైనప్పుడు మాట కేమొచ్చిందని ఎదురు చెప్పిందా ఇల్లాలు. చివికి చివికి గాలివానవుతోంది.

లక్ష్మీపతికి ఉరి ఏర్పాటయింది. ఒక కుర్చీని లాక్కుని ముడికి కిందగా వేసుకున్నాడు. కుర్చీ ఎక్కుతున్నాడు.

పక్క ఇంట్లో మొగుడూ పెళ్లాల పోట్లాట ఒక స్టేజీకి వచ్చి నిలబడింది. మొగుడు రైలు కిందపడి చస్తానని ఇంట్లోంచి పరుగెత్తాడు. పెళ్ళాం నూతిలో పడతానని నడిచింది. పిల్లలు అమ్మా, నాన్నంటూ ఏడుస్తున్నారు. ఇరుగింటి పొరుగింటివాళ్ళు విడ్డూరం చూస్తున్నారు.

లక్ష్మీపతి ఉరి ముడిలోకి తల పెట్టేడు. తాడు సరిచేసుకున్నాడు. దేవుడికి ఆఖరి నమస్కారం చేశాడు. కాలితో కుర్చీని తన్నబోయాడు. దబ్ మని శబ్దమైంది. ఆ తర్వాత దబదబా శబ్దమవుతోంది. తలుపు పగిలిపోయే విధంగా తలుపుని గుద్దుతున్నారు. గడియ విరిగిపోయి తలుపులు తెరచుకున్నాయి.

లోపలికి లోకనాధం వచ్చాడు. లక్ష్మీపతి స్థితిని చూసి లబోమంటూ గుండె కొట్టుకున్నాడు. ఆ ప్రయత్నం నుంచి అతన్ని తప్పించేడు. అతన్ని తనిష్టమొచ్చినట్టు తిట్టాడు. పచ్చటి కొంపల్లో ఈ దిక్కుమాలిన ప్రయత్నం చేసి నా వ్యాపారాన్ని మంటగలపాలనుకున్నావా? నువ్వు బలవంతంగా ఛస్తే ఇంకోడు ఈ ఇళ్లల్లో అద్దెకు రావడానికి వప్పుకుంటాడా? చావాలనుకుంటే గంగలో దూకి చావు. ఫో....అని మెడ పట్టుకు గెంటాడు. లక్ష్మీపతి తలొంచుకుపోతున్నాడు.

లక్ష్మీపతి వొదిలేసిన ట్రంకుపెట్టి, పాతబట్టలూ వగైరాలకు ధరకట్టి దక్కిందే దక్కుడని సంతృప్తి పడుతున్నాడు లోకనాధం.

పక్కింటి గుమాస్తా మొగుడు చావు ప్రయత్నానికి చుక్కబెట్టి తనింటికి వచ్చేశాడు. అరుగుమీద దుమ్ముని తువాల్తో తుడిచి "శాంతా" అని పిలిచేడు. శాంత చెంగుతో చేతులు తుడుచుకుంటూ ఇంట్లోంచి బయటకు వచ్చింది. ఆమె వెంట పిల్లలున్నారు. ఎన్నడూ లేనిది ఇవాళ రైలు బిఫోర్ టైంలో వెళ్ళిపోవడంవల్ల పట్టాలు మాత్రమే కనిపించేయనీ, అందువల్ల చావుకి వాయిదా వేసుకున్నానన్నాడు.

దార్లో ఫ్రెండెవరో కనిపించి పది రూపాయలు అప్పిచ్చేడన్నాడు. దాంతో రెండు రోజులు గడపమని భార్యకి డబ్బు యిచ్చేడు. భార్య కూడా చెప్పింది - నూతిలో పడదామని వెడితే, పక్కింటి పిన్నిగారు కాఫీపొడుంతో పాటు పప్పు, ఉప్పు ఇచ్చేరనీ, రెండురోజులు దివ్యంగా గడుస్తాయనే ఉద్దేశంతో చావుకోరిక వాయిదా వేసుకున్నానని! అప్పులు వాడుకుని, రెండు రోజులైం తర్వాత - మూడోనాడు ఇద్దరూ కలిసి చద్దామనుకున్నారు.

క్లాక్ టవర్ ఎనిమిది గంటలు కొట్టింది. లక్ష్మీపతి రోడ్డుమీద బరువుగా నడుస్తున్నాడు. ఎనిమిది గంటలూ విని- "అప్పుడే రెండు గంటలు వృధాగా గడిచేయ"ని అనుకున్నాడు.

చక్రవర్తి - ఒక కుర్రాడు - లక్ష్మీపతి ఖాళీచేసిన గదిలోకి వచ్చేడు. చక్రవర్తికి లోకనాథం ఆ గది గురించి చెబుతున్నాడు.

"ఈ గది గురించి నేను చెబుతే బాగుండదు. అయినా చెప్పాలి. లక్ష్మి-సాక్షాత్తు లక్ష్మి తాండవించే గది ఇది. ఈ గదిలో వున్నవాళ్ళంతా మూడుపూలు ఆరుకాయలుగా గడిపి వెళ్ళేరు. ఇప్పుడే ఒక కుర్రాడు వెళ్ళేడు. అతనొచ్చినప్పుడు గుమాస్తా. గదిలోచేరి ఆర్నెల్లు అయింది. ఆఫీసరుగా ప్రమోష నొచ్చింది. వెళ్ళిపోయాడు. వెడుతూ వెడుతూ తను తెచ్చుకున్న చెంబూ, తప్పేళాలు వదిలేసి వెళ్ళాడు. తీసుకెళ్ళు బాబూ అని ఎంత పోరినా వినలేదు,

తన జ్ఞాపకార్థం వుంచమని, నన్ను మొహమాటంలో పెట్టి వెళ్ళిపోయాడు. అతని అభిమానం అల్లాంటిది !

చక్రవర్తి అంతా విని సంతోషించేడు! తానొక లైబ్రరీ పెట్టినా బాగుండునన్నాడు. గది చలవవల్ల నాలుగు బేరాలు ఎక్కువ దొరికితే అదే పదివేలన్నాడు. ఇరవై రూపాయలు అడ్వాన్సుగా యిచ్చి లోకనాథాన్ని పంపించేడు. లోకనాథం, లక్ష్మీపతి వదిలి వెళ్ళిన సామానులు తీసుకుని వెళ్ళిపోయేడు.

చక్రవర్తి తాను తెచ్చిన సామాను సర్దుకుంటుండగా— అతని కాలికి లక్ష్మీపతి ఆత్మకథ పుస్తకం తగిలింది. ఆ పుస్తకం తీసి కుతూహలంతో చివరిపేజీ చూసేడు. అందులో తాను ఆత్మహత్య చేసుకునే ప్రయత్నంలో వున్నట్టు లక్ష్మీపతి రాసుకున్నది చదివేడు. ఉలిక్కిపడ్డాడు. 'లక్ష్మీపతి' అని గొణుక్కున్నాడు.

చక్రవర్తికి మిత్రుడు లక్ష్మీపతి. లక్ష్మీపతి కోరిక చదవగానే షాకైన చక్రవర్తి ముందు పేజీలు తెరిచేడు.

కొంత ఉపోద్ఘాతం నడిచింది. తానెక్కడ పుట్టిందీ, ఎల్లా పెరిగిందీ ఆత్మ కథకి అవసరమైన గుర్తులేక రాయడం లేదన్నాడు. తల్లిదండ్రుల్లేని తాను ఎల్లా చదువుకున్నదీ ముఖ్యం కాదన్నాడు. డిగ్రీ చేత పుచ్చుకుని జీవితంలో అడుగు పెట్టిన దగ్గర్నుంచీ ఈ ఆత్మకథ మొదలెట్టాలనుకున్న సంకల్పమే ఆత్మకథకి ప్రారంభ మన్నాడు.

ఉపోద్ఘాతం తర్వాత చక్రవర్తి చదువుకున్నది దృశ్యరూపంగా నడుస్తోంది.

రైలు ప్లాట్‌ఫారమ్ మీదకి వచ్చి ఆగింది. అందు

లోంచి లక్ష్మీపతి దిగేడు. చేతిలో సంచి వగైరాలున్నాయి. రైలు దిగి ప్లాట్‌ఫారమ్మీద నిలబడి దిక్కులు చూస్తున్నాడు.

ప్లాట్‌ఫారం అవతల అంచున చక్రవర్తి బిజీగా తిరుగుతున్నాడు. రద్దీగా వున్న పెట్టెముందర నిలబడి రైలు ఎక్కేవాళ్ళనూ, దిగేవాళ్ళనూ చూస్తున్నాడు. అవకాశం దొరికినప్పుడు వాళ్ళ జేబులు కొడుతున్నాడు. తనకి పరిచయం లేనివాళ్ళను, పరిచయ మున్నట్టు పలుకరిస్తున్నాడు. వాళ్ళు రైలు దిగేందుకూ, ఎక్కేందుకూ సాయపడుతున్నాడు. వాళ్ళ జేబుల్లో వున్న పర్సులను లాఘవగాం తీసి తన జేబులో తోసుకుంటున్నాడు. అప్పటికే చక్రవర్తి మూడు పర్సులు కొట్టేశాడు. ఇక చాలనుకుని నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ కొంత దూరం నడిచేడు. ఆపైన పరుగులాటి నడకతో వేగంగా, ఖంగారుగా నడుస్తున్నాడు.

ఆ ఖంగార్లో చక్రవర్తి లక్ష్మీపతిని ఢీకొన్నాడు. లక్ష్మీపతి చేతిలో వస్తువులు కింద పడిపోయాయి. ఆ వస్తువులు తీసి చక్రవర్తి లక్ష్మీపతిని చూసేడు. వెంటనే 'నువ్వా' అన్నాడు. అతన్ని దగ్గరికి తీసుకుంటో 'ఇదేనా రావడం' అన్నాడు. ఆపైన 'ఏమిటీ గిరాకీ' అని అడిగేడు. లక్ష్మీపతి ఉద్యోగంకోసం వచ్చేనని చెప్పేడు. ఎక్కడ వుండాలో యింకా నిర్ణయం చేసుకోలేదన్నాడు. చక్రవర్తి తన దగ్గర వుండవలసిందిగా కోరేడు. లక్ష్మీపతి కాదంటే చక్రవర్తి వినలేదు. స్నేహితుల మైనందుకు ఆమాత్రం

సాయపడకపోతే పాప మాతుం దన్నాడు. చివరికి లక్ష్మీపతిని తనింటికి తీసుకు పోవడానికి వప్పించేడు చక్రవర్తి.

ఇద్దరు మిత్రులూ నడుస్తున్నారు. స్టేషన్నించి బయటకు వచ్చింతర్వాత లక్ష్మీపతి చక్రవర్తిని 'ఈ వూర్లో నువ్వేం ఉద్యోగం చేస్తున్నావ'ని అడిగేడు. చక్రవర్తి వెంటనే జవాబు చెప్పలేదు. ఆ ప్రశ్నకి నిజమైన సమాధానం చెబితే ఈ మిత్రుడు తనని అసహ్యించుకుంటాడు. ఈ మిత్రుడు కళ్ళకి తను అంత త్వరగా పట్టుబడకూడదు. జేబు దొంగగా కనుపించకూడదు. చక్రవర్తి ఎంతసేపటికి జవాబు చెప్పక పోవడంతో మళ్ళా అదే ప్రశ్న అడిగేడు లక్ష్మీపతి. తప్పదన్నట్టుగా ఒక కట్టుకథ చెప్పేడు చక్రవర్తి.

'నేను చేసే ఉద్యోగం చాలా ప్రమాదకరమైంది. నా ఉద్యోగ వివరాలు ఎవరికీ తెలియకూడదు. తెలుస్తే నేను నా ఉద్యోగం చేయలేను.

లక్ష్మీపతికి ఆశ్చర్యం కలిగింది.

'ఏమిటబ్బా .... అంత విడ్డూరమైన ఉద్యోగం!' అని అడిగేడు.

'సి. ఐ. డి.'

'సి. ఐ. డి. వా!

లక్ష్మీపతి చేతిని నొక్కి అన్నాడు చక్రవర్తి.

'ఉష్. గట్టిగా అనకు. ప్రాణాలు పోతాయి. కమీషను వ్యాపారమని అందర్తో చెబుతున్నాను. నా గురించి ఎవరైనా అడుగుతే నువ్వూ అంతే చెప్పాలి. ఓ. కే. ఇంక నడు.'

వాళ్ళు బయటకు వచ్చింతర్వాత చక్రవర్తి ఒక టాక్సీని పిలిచేడు. అందులో యిద్దరు మిత్రులూ ఎక్కేరు. టాక్సీ కదిలింది.

ఆత్మకథ రాసింది లక్ష్మీపతి. చదువుతున్నది చక్రవర్తి. ఆత్మకథలో రాసిన తన పాత్రతోపాటు ఇతర పాత్రలూ, సన్నివేశాలూ చాలా వరకు చక్రవర్తికి తెలుసు. అందువల్ల లక్ష్మీపతికి మొదట్లో తెలిసిన రహస్యాలు సైతం తెలిసినట్లే దృశ్య రూపంగా చెప్పడ మవుతోంది. ఆత్మకథ చదివి చక్రవర్తి తన గతాన్నికూడా ఒక పక్క ఆలోచిస్తున్నాడు. ఈ ఆత్మకథని చక్రవర్తి కాకుండా మరో పరాయి వ్యక్తి చదువుతుంటే ఈ కథ ఇట్లా నడిచేది కాదు.

టాక్సీ చక్రవర్తి ఇంటిముందు ఆగింది. మిత్రులు దిగారు. లక్ష్మీపతి టాక్సీకి డబ్బులివ్వబోతూండగా చక్రవర్తి వారించాడు. నువ్వు నా గెస్టువి. టాక్సీ ఛార్జీ నే నిస్తానన్నాడు. ఒక జేబులో చెయ్యిపెట్టి పర్సు తీశాడు. దాన్లో నయాపైసా కూడా లేదు. దాన్ని అవతలికి విసిరాడు. మరో జేబులోంచి ఇంకో పర్సు తీశాడు. దాన్లో వున్నవన్నీ వంద రూపాయల కాగితాలు. చెయ్యి వణికింది. దాన్ని జేబులోనే వుంచి, మూడో పర్సు తీశాడు. దాన్లో చిల్లర డబ్బుల్తోపాటు కొన్ని చిన్న కాగితాలున్నాయి. టాక్సీకి డబ్బు లిచ్చి పర్సు లోపల పెట్టాడు.

"డబ్బు దాచుకోవడానికి ఒక పర్సు చాలదా చక్రవర్తీ!"

"నా మొహం. తృప్తికి అంతెక్కడ? ఏ పర్సులో

ఎంత వుందో నాకుమాత్రం ఏం తెలుసు? ఇదిగో పర్సంటారు. పుచ్చుకుంటాను. నా డ్యూటీ అంతవరకే! అంతా సీక్రెట్.

చక్రవర్తి ఇంటి తాళం తీశాడు. మిత్రులిద్దరూ ఇంట్లోకి వెళ్లేరు. ఆ ఇల్లు విశాలంగావుంది. నీటుగా సర్దబడి వుంది. "ఇది బాత్‌రూం, ఇది కిచెన్, ఇది బెడ్‌రూమ్" అంటూ చక్రవర్తి ఇల్లంతా చూపించాడు. సంసారులుండే ఇల్లులాగా వుందిగానీ, బ్రహ్మచారుల మఠంలాగా లేదు. ఇంటిని పరిశీలనగా చూస్తున్న లక్ష్మీపతి - బట్టల స్టాండుమీద గల చీరలూ, జాకెట్లూ చూసి షాకయ్యాడు. 'నీకు పెళ్ళయిందా?' అని చక్రవర్తిని అడిగేడు. లేదన్నాడు చక్రవర్తి. ఆ చీరలూ....జాకెట్లూ ఎవరివని అడిగాడు. సీతవని చెప్పేడు చక్రవర్తి.

సీత ఆ ఊళ్ళో చిన్న ఉద్యోగం చేస్తోంది. సొంతఊళ్లో పెద్ద సంసారముంది. అమ్మా, నాన్న - చెల్లెళ్లు, తమ్ముళ్లూ వాళ్ళంతా సీత సంపాదనమీదే ఆధారపడి వున్నారు. ఖర్చు తక్కువతో పొదుపు చేయాలనే ఉద్దేశంతో సీత తనతో పాటు అద్దెకుంటోందని చెప్పాడు. అద్దెను రెండు భాగాలు చేసి చెరోభాగం భరిస్తున్నామన్నాడు. ఆమె వంటసామాగ్రి కొంటే, తాను ఫర్నిచరూ వగైరా కొన్నానన్నాడు. ఆ విధంగా, ఒక సంసారానికి ఏం కావాలో సమస్తం అమర్చుకున్నామన్నాడు.

అంతలో సీత ఇంట్లోకి వచ్చింది. సీతను లక్ష్మీపతికి పరిచయం చేశాడు.

"ఇకముందు అద్దెతో పాటు అన్ని ఖర్చులూ మూడు భాగాలు చేద్దాం. వీడు నా గెస్టు. నాతో పాటే వుంటాడు. రెండు భాగాల పైకం నేను చెల్లిస్తాను. ఒ. కే.!" అని సీతను అడిగాడు చక్రవర్తి.

సీత హాయిగా నవ్వింది. అందుకు అంగీకరించింది.

"నీ ఉద్యోగం దొరికేంతవరకూ నువ్వు నాకు నయాం పైసా ఇవ్వద్దు. ఉద్యోగం దొరికింతర్వాత నీ భాగం ఖర్చు చెల్లిస్తుండు. ఒ. కే.!" లక్ష్మీపతి నడిగాడు చక్రవర్తి.

లక్ష్మీపతి తలూపాడు.

లక్ష్మీపతికి చక్రవర్తికి స్నేహంవుంది. కనుక వాళ్లు ఆత్మీయులే. సీత కొత్తమనిషి. అదేం చిత్రమోగాని పరిచయమైన మరుక్షణమే బాగా దగ్గరైపోయింది. ఎంతో చనువుగా స్నేహంగా మాట్లాడసాగింది. స్వయంగా కాఫీలు చేసి పట్టుకొచ్చింది. స్నానాలకు నీళ్లు తోడింది. వేడి వేడి టిఫిన్లు చేసి వడ్డించింది.

చక్రవర్తి, లక్ష్మీపతిని ఎంప్లాయిమెంట్ ఆఫీసుకి తీసుకెళ్లాలని చెప్పగా - క్షణంలో కమ్మని వంట సిద్ధంచేసి, కంచాల్లో వుంచింది.

ఇద్దరు మిత్రులూ తృప్తిగా భోజనం చేశారు. ఎంప్లాయిమెంటు ఆఫీసుకి బయలుదేరారు. వెళ్ళేముందు, సీత లక్ష్మీపతికి 'బెస్టాఫ్‌లక్!' చెప్పింది, చీకటి పడకముందే ఇంటికి రమ్మంది.

ఆమె స్నేహభావానికి లక్ష్మీపతి ముగ్ధుడయ్యాడు. చక్రవర్తికీ, సీతకూగల అపూర్వమైన మైత్రికి ముచ్చట

పడ్డాడు. దార్లో చక్రవర్తిని "నువ్వు సి. ఐ. డీ. వని సీతకు తెలుసా ?" అని ప్రశ్నించాడు. లేదన్నాడు చక్రవర్తి! నా ఉద్యోగంలోవున్న సాధక బాధకాలు ఆమెకు తెలీకూడదు. ఆమె ఇంట్లోంచి వెళ్ళిపోవచ్చు. ఆమె వెళ్ళిపోతే కొన్ని సౌఖ్యాలకు దూరం కావలసివస్తుంది. నా దురదృష్టవశాత్తు ఈ దిన దినగండం ఉద్యోగం చేస్తున్నాను. సీత కోసరమైనా మరో మంచి ఉద్యోగం చూసుకోవాలి" అన్నాడు చక్రవర్తి.

లక్ష్మీపతిని ఎంప్లాయిమెంటు ఆఫీసు దగ్గరకు తీసుకొచ్చాడు చక్రవర్తి. ఆఫీసుముందు హనుమంతుని తోకలాగా వేలాదిమంది యువకులు క్యూలో, ఎండలో నిలబడివున్నారు. వాళ్ళ చేతుల్లో సర్టిఫికేట్లు వగైరాలున్నాయి. అంతమంది జనాన్ని చూడగానే లక్ష్మీపతి భయపడ్డాడు. ఒకడుగు వెనక్కి వేశాడు. చక్రవర్తి అతని భుజం తట్టాడు. ధైర్యం చెప్పాడు.

"వెళ్లి క్యూలో నిలబడు. పిలుపు ఆలస్యం కావచ్చు. సీతమాట వృథా కాదు. మంచే జరుగుతుంది. మంచి ఉద్యోగమే దొరుకుతుంది. ఆలస్యమైనా ఫర్లేదు. ఆదుకునేందుకు, నేనూ - సీతా వున్నాం. గుడ్ లక్!"

రెండు ముక్కలూ చెప్పి చక్రవర్తి తన డ్యూటీలోకి తాను వెళ్ళిపోయాడు. లక్ష్మీపతి క్యూలో చివరివాడుగా నిలబడివున్నాడు.

చక్రవర్తి డ్యూటీలో వున్నాడు. రైళ్ళెక్కి దిగుతున్నాడు- చేతికందిన సూటుకేసుల్తో, మనీపర్సుల్తో.

ఎంప్లాయిమెంటు ఆఫీసులో....

సాయంత్రానిగ్గాని లక్ష్మీపతికి పిలుపు రాలేదు. ఆఫీసరు ముందు కూచున్నాడు. తానేమి చదువుకున్నదీ, తనకి ఎల్లాంటి ఉద్యోగం కావలసిందీ వివరంగా చెబుతున్నాడు. తాను కోరుకునే, కలలుగనే ఉద్యోగం తనకి అందుబాటులో వున్నదని లక్ష్మీపతి ఆశ. ఆ ఆశ తాలూకు అమాయకత్వం అతని మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

కానీ, ఇల్లాంటి యువకులను లక్షలాదిమందిని చూచిన ఆఫీసరు నిమ్మకు నీరెత్తినట్టున్నాడు. మవునంగా వుండి వింటు న్నాడు. లక్ష్మీపతికి కావలసిన ఉద్యోగం అసలువుందో, వుంటే అతనికి వస్తుందో రాదో అన్నీ ఆ మానవునకు తెలుసు. ఎక్కడా బయటపడకుండా విన్నాడు.

ఆఫీసులో పనైపోయింతర్వాత, లక్ష్మీపతి ఇంటివేపు నడుస్తున్నాడు. చీకటి పడింది. ఊర్లో కొత్త సినీమా విడుద లయ్యింది. థియేటరువద్ద ఇసుకవేసినా రాలనంత జనం, వేలం వెర్రిగా నిలబడియున్నారు. లక్ష్మీపతి నడుస్తున్నవాడల్లా ఠక్కున ఆగిపోయాడు.

చక్రవర్తి చెమటలో తడిసిపోయివున్నాడు. అతని రెండు చేతులనిండా టిక్కెట్లున్నాయి. జేబురుమాలు మెడకి చుట్టుకుని వున్నాడు. టిక్కెట్లను బ్లాక్‌లో అమ్ముతున్నాడు. రూపాయిన్నర, మూడు రూపాయలంటున్నాడు. రెండురూపా యలు నాలుగంటున్నాడు. కొందరు ఆ టిక్కెట్లను కొంటు న్నారు. చక్రవర్తి టిక్కెట్లను అమ్ముకుంటూ - ఖంగార్లో లక్ష్మీపతి కూడా అమ్మడానికి వచ్చాడు. లక్ష్మీపతి చక్రవర్తి చేతులు ఠక్కున పట్టుకున్నాడు. చక్రవర్తి

లక్ష్మీపతి మొహంచూసి బిత్తరపోయాడు. అంతలోనే, సర్దుకుని, లక్ష్మీపతిని పక్కకు తీసుకెళ్ళి కట్టుకథ చెప్పేడు.

"నేను డ్యూటీలో వున్నప్పుడు నువ్వు నన్ను కలవకూడదు. పోలీసులు నిగా వుంటారు. జనం చూస్తుంటారు. నువ్వు నా స్నేహితుడవని వాళ్ళకి తెలుస్తే నీకు సుఖం వుండదు. కనక, బయట నాతో చనువుగా వుండకు. బ్లాక్ లో టిక్కట్లమ్మే బేచ్ ఒకటి ఈమధ్య ఒక గొప్ప దొమ్మీ కేసులో ఇరుక్కున్నారు. వాళ్ళ వివరాలు తెలుసుకునేందుకు నేనీ వేషం వెయ్యక తప్పిందికాదు. ఎవరూ చూడక ముందే వెళ్ళిపో. లేకపోతే, నీకు చాలా ప్రమాదం. ఇంటికొస్తాను. అప్పుడన్నీ మాటాడుకోవచ్చు. వెళ్లు."

లక్ష్మీపతి చక్రవర్తిని వదిలి వెళ్ళిపోయాడు. ఇంటికి చేరుకునేసరికి సీత వంటరిగా వుంది. కాఫీ చేసి పట్టుకొచ్చింది. చక్రవర్తి గురించి ఆలోచిస్తున్న లక్ష్మీపతి, సీతను మాటల్లోకి దించేడు.

"చక్రవర్తి రోజూ ఆలస్యంగా వస్తాడా సీతగారూ?"

"అవును. పొట్టతిప్పలు. మనిషికి చదువుకునే రోజులే కమ్మగా వుంటాయి. ఇప్పుడా విషయాలెందుగ్గాని, నువ్వొళ్ళిన పనేమైంది?"

ఎంప్లాయిమెంటాఫీసులో జరిగినదంతా చెప్పాడు లక్ష్మీపతి. సీత నీళ్లు తోడింది. లక్ష్మీపతి స్నానం చేశాడు. భోజనానికి రమ్మంది. చక్రవర్తి వచ్చింతర్వాత భోంచేస్తానన్నాడు. సీత నవ్వింది.

"పిచ్చివాడా" అతనెప్పుడొస్తాడో అతనికే తెలీదు.

అతనికోసం ఎదురుచూస్తే రెండు రోజులకోసారి భోజనం.... లే, లే!'' అన్నది.

లక్ష్మీపతి భోజనం పూర్తిచేశాడు. సీత అతనికి పక్క ఏర్పాటు చేసింది. పక్కమీద నడుం ఆన్చాడేగాని లక్ష్మీపతి నిద్రపోవడంలేదు. మధ్యలో సీత వచ్చి అడిగింది.

"ఇంకా నిద్రపోలే! ఆలోచన్లు మనిషిని ఆరోగ్యంగా వుంచ వచ్చాయ్ ! హాయిగా నిద్రపో. ఏదో వేళకి అత నొస్తాడు. భోంచేస్తాడు. పడుకుంటాడు. అతని కోసం మనం ఎందుకు మేలుకోవాలి? పడుకో'' అన్నది.

లక్ష్మీపతి నిద్రకు కళ్ళు మూసుకున్నాడు. ఎప్పుడో పన్నెండు గంటలక్కాబోలు చక్రవర్తి తలుపు తట్టాడు. లక్ష్మీపతి వెళ్ళి తలుపు తీద్దామనుకున్నాడు. కానీ, సీతే స్వయంగా లేచి వెళ్ళి తలుపు తీసింది. చక్రవర్తి లోపలికి వస్తూ అన్నాడు—

"సారీ'' మీకు శ్రమనిస్తున్నాను!''

"ఫర్లేదు. అలవాటైపోయింది.''

"మా వాడు నిద్రపోయాడా ?''

"ఆహా. మీమీద బెంగతో కాసేపు అల్లరి చేసేడు. కోప్పడ్డాను. నిద్రపోయాడు, స్నానంచేసిరండి, వడ్డిస్తాను.''

"అర్ధరాత్రీ, అపరాత్రీ వచ్చి మీచేత సేవలు చేయించుకోవడం సిగ్గుగావుంది.''

"రోజూ మీరీ మాటంటుంటే విన లేక నాకూ సిగ్గుగానేవుంది. ముందు స్నానం ప్లీజ్.''

లక్ష్మీపతికి వాళ్ళిద్దరి అనుబంధం అబ్బురంగాతోచింది.

చక్రవర్తి గురించి నిర్లక్ష్యంగా మాట్లాడిన సీత, అతనొచ్చిం తర్వాత ఎంతో ఆదరంగా ప్రవర్తిస్తుంటే చూడ ముచ్చటగా వుంది. తాను మేలుకుని వున్నట్టు తెలుస్తే ఆమె అల్లాగే ప్రవర్తిస్తుందో లేదోనని నిద్రపోతున్నట్లు నటిస్తూ అంతా గమనిస్తున్నాడు.

చక్రవర్తికి ఆమె భోజనం పెట్టింది. కన్న తల్లిలా అతని చేత అన్నం తినిపించింది. ఆకులూ, వక్కా యిచ్చింది. అతని పక్క సర్దింది. అతనొచ్చి మంచమెక్కిం తర్వాత, కమ్మగా "గుడ్ నైట్" చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయింది.

అంతా చూసిన లక్ష్మీపతి మనసు పరవశించింది.

రోజులు ఇల్లాగే హాయిగా గడుస్తున్నాయి. లక్ష్మీపతి కూడా ఆ ఇంటికోసం చిన్న చిన్న వస్తువులూ, డోర్ కర్టెన్లు కొన్నాడు. ఉద్యోగం లేకుండా నీకేమిటీ ఖర్చులని సీత కోప్పడింది. కానీ, లక్ష్మీపతి సర్ది చెప్పాడు.

ఒకనాడు—

ఆ ఇంటికి పోలీసులు వచ్చారు. లక్ష్మీపతి వాళ్ళను చూశాడు. చక్రవర్తితో చెప్పాడు. చక్రవర్తి ముఖ కవళికలు మారిపోయాయి. "వాళ్లు నిన్నేమైనా అడిగారా ?" అని అడిగాడు లేదంటూ తలూపాడు లక్ష్మీపతి. "వాళ్ళతో నువ్వేమైనా మాట్లాడేవా ?" అన్నాడు. మళ్లా లేదన్నాడు లక్ష్మీపతి.

"గుడ్ బోయ్. మేనల్లుడంటే అల్లావుండాలి. వాళ్లు వచ్చింది నా కోసమే. నన్ను స్టేషన్‌కి తీసుకుపోతారు. నిన్న ఏం చేశాను? ఇవాళ ఏం చేస్తాను? రేపు ఏం చేయబోతాను?

—ఈ వగైరా వివరాలన్నీ అడుగుతారు. చెప్పాలి. చనువుగా మెడమీద చెయ్యివేస్తారు. డొక్కల్లో పొడుస్తారు. కావలించుకుంటారు. ఒక్క గొడవకాదు. ఇల్లాంటివి నువ్వు చూడకూడదు. ఇంట్లోనే వుండు. మళ్ళా సాయంత్రానికిగాని వాళ్ళు నన్నొదలరు. సాయంత్రం కలుద్దాం" అని చెప్పి చక్రవర్తి బయటకు వెళ్ళిపోయాడు. పోలీసుల్తోపాటు స్టేషను వేపు నడుస్తున్నాడు.

సీత కాఫీ ఏర్పాటుచేసి లక్ష్మీపతిని, చక్రవర్తిని పిలిచింది. లక్ష్మీపతి ఒక్కడే కాఫీ కొచ్చాడు. చక్రవర్తి పని మీద బజారు వెళ్లినట్లు చెప్పాడు. కాఫీ తాగుతూ లక్ష్మీపతి సీతతో మాట్లాడాడు.

"మిమ్మల్నో మాట అడగనా సీతా ?"

"అడుగు."

"మీకు చక్రవర్తి అంటే చాలా యిష్టంకదూ ? నిజమే చెప్పండి."

"నువ్వన్నా నా కిష్టమే."

'కానీ చక్రవర్తిని మీరు ప్రేమిస్తున్నారు. అవునా !'

'అవును అయితే !'

'మీ రిద్దరూ ఎందుకు పెళ్ళి చేసుకోగూడదూ !'

'ఆ సంగతి అతను అడిగితే బావుంటుంది లక్ష్మీపతీ !'

'అతని తరఫున నే నడుగుతున్నానని అనుకోవచ్చుగా ? చెప్పండి. అతన్ని మీ రెందుకు పెళ్ళి చేసుకోకూడదూ ?'

'ఎందుకూడదు ! చేసుకోవచ్చు. కానీ, అది జరిగే పని కాదు. కాగా - నేను అతనూ భార్యా భర్తలంగానే

మెలుగుతున్నామూయే. లేకపోతే ఒక ఆడది మగవాడికి ఇంత దగ్గరగా వుంటుందా? ఈ సేవలూ, సపర్యలూ చేస్తుందా? ఇదొక రకమైన పెళ్ళే లక్ష్మీపతీ! కాకపోతే, అతన్నాకు పుస్తె కట్టలేదు. నువ్వే నాకు భార్యవని నాతో అనలేదు. సేవలూ, సపర్యలూ తప్పించి అతని కౌగిలిలో నేను పరవశించలేదు. అదేగా లోటు, ఫర్లేదు లక్ష్మీపతీ! నాకీ తృప్తి చాలు."

సీత వింత మనస్తత్వానికి లక్ష్మీపతి ఆశ్చర్యపోయాడు. ఈ విషయం చక్రవర్తితో కూడా మాట్లాడి వాళ్ళ పెళ్ళి ఏర్పాట్లు చేయాలని నిశ్చయించుకున్నాడు.

ఆ సాయంత్రం చక్రవర్తి ఇంటికి రాగానే అతన్తో ఈ విషయమే మాట్లాడాడు. అతను లక్ష్మీపతి అమాయకత్వానికి నవ్వుకున్నాడు. అతని అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పాడు.

"ఇప్పట్లో నాకు పెళ్ళి చేసుకోవాలనిలేదు. అందుకు నా ఉద్యోగం నన్ను పర్మిట్ చేయదు. మరో ఉద్యోగం, ఆపదలేని ఉద్యోగం రావాలి. ఆ తర్వాత పెళ్ళి. పెళ్ళంటూ చేసుకుంటే సీతనే చేసుకుంటాను. సరా?"

లక్ష్మీపతి ఆ పెళ్ళి ప్రసక్తిని అంతటితో ఆపలేదు. మళ్ళా సీత దగ్గర ఆ విషయం కదిపాడు. అప్పుడామె ముఖకవళికలు మారాయి. మనిషిలో తొట్రుపాటు కనిపించింది. సంబాళించుకుంది. దృఢ సంకల్పంతో సమాధానం చెప్పింది. ఆ సమాధానం చక్రవర్తి చాటుగా నిలబడి విన్నాడు.

"మా పెళ్ళి విషయంలో నీకింత శ్రద్ధ మంచిదికాదు. నిన్ను నొప్పించడం నా కిష్టంలేదు. నా వెనక పెద్దలున్నారు. లక్ష్మీపతీ! వాళ్ళని నువ్వు కలుసుకోవడం చాలా అవసరం. నా పెళ్ళికి వాళ్ళ ఇష్టాయిష్టాలు కూడా అవసరం గదా. ఇవాళ సాయంత్రం హోటల్ అశోకాకి రా! అక్కడ నా వాళ్ళతోపాటు నే నుంటాను. వస్తావుగదూ!"

ఆ సాయంత్రం హోటల్ అశోకాకు లక్ష్మీపతి వెళ్లాడు. అక్కడ కాబరా నృత్యం జరుగుతోంది. చుట్టూ జనం వున్నారు. తాగుతున్నారు. నృత్యం చూస్తున్నారు. లక్ష్మీపతి ఒక టేబిల్ దగ్గర కూర్చున్నాడు. అతని దృష్టి దూరంగా, ఒక ఖరీదైన మనిషితో కూచున్న సీత మీద వున్నది.

సీతకు ఆ మనిషి ఏవేవో చెబుతున్నాడు - సీత మీద వాలి. సీత నిశ్శబ్దంగా నవ్వుతోంది. ముంగురులు సర్దుకుంటోంది- వయ్యారంగా. ఆ మనిషి సీతకు కొంత డబ్బిచ్చాడు. ఇద్దరూ కలిసి ఒక గదిలోకి వెళ్ళారు. తలుపులు మూసుకున్నారు.

కాబరా జరుగుతోంది. లక్ష్మీపతికి అసహనంగా, అసహ్యంగా వుంది. చివాలున లేచి బయటకు వచ్చాడు. ఇప్పుడు అతను ఖాళీచేసిన కుర్చీలో చక్రవర్తి కూర్చుని వున్నాడు. అతని పిడికిలి బిగుస్తోంది. కళ్ళు ఎర్రబడ్డాయి. విస్కీ తాగుతున్నాడు. కాబరా జరుగుతోంది.

సీత గది నుంచి బయటకు వచ్చింది. ఇంకోచోట కూచుంది. మరో మనిషితో కులాసాగా కబుర్లు చెబుతోంది.

అతను సీత చుబుకాన్ని ప్రేమగా మీటాడు. చక్రవర్తి కోపంతో ఊగిపోతున్నాడు. కాబరా ఆగిపోయింది. సీత బయటకు నడిచింది. ఆమెను వెంబడించాడు చక్రవర్తి. సీత ఒక చోట ఆగింది. విసురుగా నడిచి సీతను చేరుకుని ఆమె చెంప ఛెళ్ళుమనిపించాడు చక్రవర్తి. సీత కళ్లల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. కానీ, ఏడవలేదు. పైగా నవ్వింది. చక్రవర్తి రెచ్చిపోయాడు.

"నువ్వు ఆడదానివిగావు" అన్నాడు.

"నిజమేనేమో! గానీ, ఇప్పుడు నాకెంతో తృప్తిగా వుంది. ఇన్నాళ్ళు నా వృత్తి ఏమిటో మీకెవరికీ చెప్పకుండా దాచుకుని కుమిలిపోయాను. ఇప్పుడు ప్రశాంతంగా వుంది మనసు. నువ్వు కొట్టినందుకు బాధపడను. నీలో జాలీ, కరుణా లేనందుకు బాధపడుతున్నాను. ఏ పరిస్థితుల ప్రభావం వల్ల నేనీ పడుపువృత్తి చేబట్టానో నువ్వు అడగలేదు. ఆకలి మనిషినెంతో అల్లరి పెడుతుందో నీకు తెలుసు. అయినా, చెయ్యి వుందిగదాని కొట్టేవు. ఇన్ని నెలల పరిచయమున్న నువ్వే నన్ను కొట్టినప్పుడు-సంఘంలో యింకో మనిషి నన్నాదరిస్తాడనీ, నా కన్నీటికి చలిస్తాడనీ, నా జాలికథ వింటాడనీ నే నెల్లా అనుకుంటాను? మంచి పాఠమే చెప్పావు చక్రవర్తీ! గంపెడు సంసార బాధ్యతలూ, ఆకలీ నన్నీ వృత్తిలోకి దించాయి. నేను ఒక వ్యక్తికి భార్య నవ్వాలనీ, నా కుటుంబం - నా సంసారం - నా పిల్లలూ అని చెప్పుకునే వాతావరణంలో పెరగాలని కలలు గనేదాన్ని ఒకప్పుడు! కానీ ఈ వృత్తిలో చేరి స్త్రీత్వాన్ని పోగొట్టుకున్నాను.

ఇంకెక్కడి కలలు .... గగన కుసుమాలయ్యేయి. కనీసం నటించైనా ఒక వ్యక్తికి భార్యగా వుండి, అతని కష్టసుఖాలు పంచుకుందామనుకునే ఆశతో నీ దగ్గరకి వచ్చి చేరాను. నటనలోనే తృప్తిని పొందాను. ఒకరకంగా నేను అదృష్ట వంతురాలిని. నువ్వు జేబు దొంగవు. ఆశ్చర్యపడకు. నాకు ఆ విషయం ముందే తెలుసు. ఒక అమాయకుడు నీ స్నేహి తుడు. అతన్ని నీ మాయమాటల్తో యింకా మోసగిస్తూనే వున్నావు. ఆ ఓపిక నాకు లేక, నే నేమిటో చెప్పాలను కున్నాను. ఇక్కడికి రమ్మన్నాను. నే నేమిటో తెలుసు కున్నాడు. ఇంకా దాచుకునే రహస్యాలు నాకు ఏమీ లేవు. ఒక చిన్న రిక్వెస్టు.... "నీకు నేనున్నాను సీతా— నువ్వంటే జాలి నాకు" అని ఒక్కమాటను. నువ్వు కొట్టిన దెబ్బ మరచిపోతాను. నీ తియ్యటి మాటలతో పులకిస్తాను. చక్ర వర్తీ! నన్ను అసహ్యించుకోకు. జాలిపడు."

"వ్యభిచారి మీద జాలి, కరుణలకు చోటులేదు. నువ్వంటే అసహ్యంగా వుంది. రోతగా వుంది! అని చక్ర వర్తి అక్కడ్నుంచి విసురుగా వెళ్ళిపోయాడు. సీత విషా దంగా నవ్వుకుంది. కన్నీటిని తుడుచుకుంది.

చక్రవర్తి ఇంటికి వచ్చాడు. లక్ష్మీపతి దిగులుగా కూచుని వున్నాడు. అతన్తో చక్రవర్తి మాట్లాడలేదు. ఇంట్లోకి వెళ్లాడు. సీత వస్తువుల్ని కసిగా విసిరి పారేస్తున్నాడు.

ఆ ఇంటికి పోలీసులు వచ్చారు. వాళ్ళని లోపలికి పిలిచాడు చక్రవర్తి. తానేమిటో తన మిత్రుడికి చెప్పవలసిం దిగా వాళ్ళనే కోరాడు. లక్ష్మీపతికి చక్రవర్తి జేబు దొంగని

అప్పుడే తెలిసింది. చక్రవర్తి పోలీసుల్తో కదలబోయేముందు లక్ష్మీపతితో అన్నాడు—

"క్షమించరా ఫ్రెండ్ - చేస్తున్న తప్పుడు పనులు సీత కంటే ఆలశ్యంగా చెప్పాను. ఇన్నాళ్ళు నీకు ఏవేవో కట్టుకథలు చెప్పి నమ్మించాను. ఇదే నా అసలు జీవితం, నా నిజమైన ఉద్యోగం. నా వివరాలు చెబితే అసహ్యించు కుంటావని చెప్పలేదు. నా దగ్గిర వుండటానికి నీకు అభి మానం అడ్డువచ్చి, బయటకు వెళ్ళిపోతావని, అమాయకుడివి గనక బాధలు పడతావని చెప్పలేదు. నీలాటి అమాయకులకు ఈ ప్రపంచం ఎన్నడూ సాయపడదు. మా లాగా బతకమని నీకు సలహా ఇవ్వను. దానికీ నువ్వు పనికిరావు. నీకు మంచి జరగాలని మాత్రం కోరుకుంటున్నాను. వస్తా!'

ఆ తర్వాత అతను పోలీసుల్తో వెళ్ళిపోయాడు.

ఇప్పుడు ఆ ఇల్లు కళావిహీనంగా వుంది. లక్ష్మీపతి మళ్లా వంటరివాడయ్యాడు. ఎన్నో జ్ఞాపకాలమధ్య సతమత మవుతున్నాడు. తాను స్నేహితు లిద్దర్తో గడిపిన తీరూ, వాళ్ళ దగ్గిర దొరికిన ఆత్మీయతా - ఆదరణా జ్ఞాపకానికివస్తే వణికి పోతున్నాడు. ఇంత రభస జరగడానికి తానే కారకుడని అంగీకరించేడు. పెళ్ళీ, పెళ్ళీ అని గోలచేసి, వాళ్ళిద్దర్నీ దూరం చేసుకున్నందుకు అతను కుమిలిపోతున్నాడు.

అల్లాంటి పరిస్థితుల్లో అతనికి ఒక ప్రైవేటు కంపెనీ నుంచి ఇంటర్వ్యూ వచ్చించి. వెళ్లాడు. ఏవిధమైన ప్రశ్నలూ వేయకుండానే అతనికి ఉద్యోగం యిచ్చాడు ప్రొప్రయిటరు. లక్ష్మీపతి ఆనందించాడు. ఉద్యోగంలో

చేరాడు. కానీ, ఆ ఉద్యోగం అతనికి మనశ్శాంతి లేకుండా చేసింది. తోటి ఉద్యోగస్థులు గాలిలో మాటాడుతున్నట్టు అసహ్యంగా అంటున్నారు.

'మాకూ అప్పా - చెల్లెళ్ళుంటే, వాళ్ళు బరి తెగించిన ఆడకూతుర్లయితే, ప్రొప్రయిటర్ల కామదాహానికి బలైపోతే- మాకూ వస్తాయి ఉద్యోగాలు .... ఘనమైన ఉద్యోగాలు.'

ఎవర్ని ఉద్దేశించి ఈ ఎత్తిపొడుపు మాటలు ప్రయోగిస్తున్నారో మొదట్లో లక్ష్మీపతికి అర్థం కాలేదు. ప్యూన్‌ని పిలిచి అడిగేడు. వాడు నిర్భయంగా సమాధానం చెప్పేడు. 'హాయిగా వుండే మా ప్రొప్రయిటర్ని పాడుచేసింది మీ అక్క. ఆమెగారి చేతిలో ఆయన కీలుబొమ్మైపోయాడు. సిగ్గూ-శరమూ, చీమూ-నెత్తురూ వుంటే వెళ్ళి మీ అక్క రాకాసి దాహాన్ని ఆపు. లేదూ, బ్రతకనేర్చినవాడివైతే మేము ఎన్ని మాటలన్నా పడుండు. అంతే!'

లక్ష్మీపతి దిగ్గున లేచాడు. తాను ఏకాకి. తనకి అక్కా-చెల్లెళ్లు ఎవ్వరూ లేరు. ఈ అక్కెవరు? గబగబా యజమాని ఇంటికి నడిచాడు. ఆ ఇంటి వరండాలో పేము కుర్చీలో కూర్చుని వుంది సీత.

'రా తమ్ముడూ! వస్తావని తెలుసుగానీ ఇంత త్వరగా వస్తా వనుకోలేదు.'

'నే న్నీకు తమ్ముడ్నా? ఛీ!'

'పూర్వం —, నే నెవరో తెలీనప్పుడు సీతగారూ అనే వాడివి. తెలిసింతర్వాత 'నువ్వు' అంటున్నావ్. బాగుందయ్యా తమ్ముడూ — మనిషి మంచితనంమ్మీద

విశ్వాసం పెంచుకోడం నాదే తప్పు. నీకు ఉద్యోగం వేయించింది నేనే. యోగ్యతలు చూసి ఉద్యోగాలిచ్చే రోజులు కావివి. నేను పతితను కావచ్చు. కాని, నా తమ్ముడి కష్టాల్లో నా చాతనైన సాయం చేయడానికి తగనా !'

'ఇది సాయమా ? కాదు. ఒక రకమైన హింస. నీ ప్రాపకంలో దొరికిన ఉద్యోగం నన్ను బతికించవచ్చు. కానీ - అనుక్షణం చస్తూ బతకాలి. ముష్టి మూడొందల రూపాయలకోసం నా చుట్టూతా వున్న మనుషులు నన్ను కాకుల్లా పొడుస్తున్నా సహించి ఊరుకోమంటావా ? అది నీలాటి బరి తెగించిన మనిషికి చాతవును. నా వల్లకాదు. దయచేసి ఇకముందు నా బాగోగుల్లో తల దూర్చకు. నా జీవితంతో ఆటలాడకు. నువ్విప్పించిన ఉద్యోగానికీ-నీకూ వెయ్యి నమస్కారాలు.

'తొందరపడుతున్నావు తమ్ముడూ !'

'మళ్లా అదేమాట? నేన్నీకు తమ్ముడ్ని కాను. కాలేను. అల్లా పిలిచి నన్ను అవమానించకు. నిజంగా నేనే నీకు తమ్ముడ్నిఅయివుంటే నువ్వీస్థితిలో పడిపోతున్నప్పుడు చూస్తూ వూరుకునే వాడిని కాదు.'

'కాని, నా తోబుట్టువులు చూస్తూ వూరుకున్నారయ్యా !'

'వాళ్ళు వెధవలు. చాతకాని దద్దమ్మలు.'

ఆ మాటకు చలించింది సీత. ఆవేశంగా అన్నది -

'కాదు తమ్ముడూ ! వాళ్ళూ నీలాటివాళ్ళే. అంత మంచివాళ్లే. నీతిగలవాళ్లే. ఆకలి - వాళ్ళ వ్యక్తిత్వాలను

చంపింది. పరిస్థితులు వాళ్ళని చాతగాని వాళ్ళుగా చేసింది. నా తోబుట్టువుల్లో నువ్వున్నా, నువ్వూ వాళ్లతో బాటు చాతకాని వాడివయ్యేవాడివి!'

'అసంభవం!'

'సవాల్ చేస్తున్నావా?'

'అవును'

'పడుపు వృత్తిలో కాలు పెట్టబోయే ఆడపిల్లను ఆదుకొని కాపాడే స్తోమతు నీకు వుందా?'

'వుంది'

'ఆమె నీ తోబుట్టువు కాకపోవచ్చు. కనీసం నీకు ఆమెతో ముఖపరిచయమైనా లేకపోవచ్చు. ఆదరిస్తావా?'

'ఆదరిస్తాను.'

'అది నీ వల్ల కాదు. ఆవేశం నీచేత అల్లా మాటాడిస్తోంది. ఆమెను చంపనైనా చంపుతావు, లేదూ, ఆమె ఆ వృత్తిలో పడిపోతుంటే నీకేమీ పట్టనట్టు చూస్తూ వూరుకుంటావ్. ఇది సీత ఛాలెంజ్.'

'నీ ఛాలెంజికోసరం గాకపోయినా, నా కర్తవ్యం పాటించడంకోసం నే నెప్పుడూ వెనకాడను. నా గురించి నువ్వు మంచే వింటావ్. వస్తా!'

అని లక్ష్మీపతి అక్కడ్నుంచి రాబోయేడు.

'తమ్ముడూ! నీలాంటి మంచివాడిని ఆవేశం మింగేసింది. నీకు నన్ను దూరం చేస్తోంది బాబూ' అని పిచ్చిగా గొణుక్కుంటోంది. ఆమాట వినే అతను అక్కడ్నుంచి కదిలాడు.

ఆ తర్వాత అతను ఆ ఊరు వదిలి, మరో ఊరు వచ్చాడు. రోజురోజుకి అతను కష్టాల్లో పడిపోతున్నాడు. చివరికి, ఆత్మ హత్య ఒక్కటే మార్గమనే నిర్ణయానికి వచ్చాడు.

*　　*　　*

- చక్రవర్తి లక్ష్మీపతి ఆత్మకథను చదవడం ముగించి నిట్టూర్చాడు. ఈ వేడిలో అతనెక్కడ ఆత్మహత్య చేసుకుం టాడోనని భయపడ్డాడు. గదికి తాళం వేసి నగరంలోకి వచ్చాడు. వీధులు తిరుగుతూ 'లక్ష్మీపతీ' అని పిలుస్తున్నాడు.

క్లాక్ టవర్ 12 గంటలు కొట్టింది.

లక్ష్మీపతి మెయిన్ రోడ్డు వెంట నడుస్తున్నాడు. 'అప్పుడే ఆరుగంటలు వృథాగా గడిచాయను'కున్నాడు. నడక వేగం పెంచాడు. దూరాన ఒక కారు వేగంగా రావడం చూశాడు. చుట్టుపక్కల మనుషులు ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. తన నెవరు గమనించడంలేదు. ఇదే అదనను కున్నాడు. కారుని దగ్గరకు రానిచ్చాడు. అకస్మాత్తుగా దానికిందపడ్డాడు.

కారుకూడా సడన్ బ్రేక్‌తో ఆగిపోయింది. వెంట్రుక వాసిలో లక్ష్మీపతి చావు తప్పింది. జనం లక్ష్మీపతిని నానా మాటలూ అంటున్నారు. కార్లోంచి ఒక సూటువాలా యువకుడు దిగేడు. లక్ష్మీపతిని కారెక్కమన్నాడు. లక్ష్మీపతి కారెక్కాడు. కారు కదిలింది.

పోలీస్ స్టేషన్లో - ఇన్‌స్పెక్టరు చక్రవర్తితో అంటు న్నాడు. ....

6]

'ఉద్యోగం దొరకనంత మాత్రాన చచ్చిపోవాలా? నాన్‌సెన్స్ .... యువకుల్లో ఈ రకమైన అశాంతి జాతికి చాలా నష్టం. బ్రతకడానికి ఉద్యోగమే చేయాలా? నీతిగా బ్రతకడానికి చాలా మార్గా లున్నాయి. చదువుకున్నవాడు గనక పదిమంది పిల్లలకు ట్యూషన్ చెప్పి బ్రతకొచ్చు. అదీ ఉద్యోగమే! అంతెందుకు నువ్వున్నావ్. చదువున్నవాడివే ఒకప్పుడు జేబుదొంగవు కావచ్చు, ఇవాళ నీతిగానే బ్రతుకు తున్నావుకదా! పైలరై తేనేం - అదొక వృత్తి. నువ్వు బతకడంలేదూ?

'నా సంగతి వేరండి. నాకు, నన్ను నమ్ముకున్న కుటుంబం ఒకటుంది. అమ్మా నాన్నా వగైరా. వాళ్ళందర్నీ నేను పోషించాలి. నేను చస్తే, నాతోపాటు మరో అయిదుగురు చస్తారు. కనీసం, వాళ్ళకోసమైనా నేను చస్తూ బతకాలి. కానీ, లక్ష్మీపతి ఏకాకి. నీతిని పట్టుకు వేళ్ళాడే కుర్రాడు. రూలు మనిషి. అన్నీ రూలు ప్రకారం జరగా లనుకుంటాడు. ఈ పిచ్చి ఆలోచనలకు తోడు, వాడిని మింగే సేంత అశాంతి. పైగా వుత్త అమాయకుడు. అందుకే, చావడానిక్కూడ ఒక రూల్ పెట్టుకున్నాడు. వాడిని చావ నివ్వకూడదు సార్ .... వాడు బతకాలి....

'ఇల్లాంటి కేసులు నా అనుభవంలో చాలాచూశాను. చావా లనుకున్నవాడు తక్షణం చస్తాడేకాని దానికో ముహూర్తం పెట్టుకోడు. చావా లనుకున్నవాడు మూడ్ ఎక్కువసేపు వుండడు. ఆ మూడ్‌కి ఒక చిన్న డైవర్షన్ చాలు. చావుమాని హాయిగా బ్రతికేస్తాడు. ఎసీ హా....

చెప్పావు గనక, మా డ్యూటీ మేం చేస్తాం' అన్నాడు ఇన్‌స్పెక్టర్. చక్రవర్తి ఆయనకి థ్యేంక్స్ చెప్పి, బయటకు వస్తున్నాడు.

ఒక హోటల్లో....

కారులో వున్న యువకునితో పాటు లక్ష్మీపతి హోటల్లో కూచునివున్నాడు. యువకుడు లక్ష్మీపతికి భోజనం తెప్పించేడు. అతను భోంచేస్తుండగా నా పేరు 'వర్మ' అన్నాడు యువకుడు. లక్ష్మీపతి భోజనం చేస్తూనే వున్నాడు. 'ఆకలి తీరిందా?' అనడిగాడు వర్మ. తలూపాడు లక్ష్మీపతి. 'ఇప్పుడుగూడా చావాలనే వుందా?' అన్నాడు. 'ఆకలి తీరిందిగదా ?'అన్నాడు వర్మ. నిజమే. ఈ పూటకి ఆకలి సమస్య లేదు. ఆ తర్వాతనో .... ఏది ఏమైనా సరే .... నేను చావాలి. చస్తాను' అన్నాడు లక్ష్మీపతి. 'నేను పిస్తోలుతో కాలుస్తాను. సిద్ధమేనా ?' అన్నాడు వర్మ. 'సిద్ధమే. శబ్దమై, అందరూచూసి, హత్యానేరం మీమీదకు నెట్టవచ్చు. ఆ భయం మీకు లేదంటే కాల్చండి. చస్తాను. లేదు, విష మేదైనా వుంటే ఈ నీళ్ళల్లో కలపండి. తాగి, గొడవ లేకుండా చస్తాను. మీరేం చేసినా సిద్ధమే' అన్నాడు లక్ష్మీపతి. వర్మ ఆనందంగా లక్ష్మీపతి భుజాన్ని తట్టేడు. నీలాటి వాడే నాక్కావాలి. రా నాతో. అంటూ కారులో ఎక్కించుకున్నాడు.

చక్రవర్తి లక్ష్మీపతికోసం' వెతుకుతూనే వున్నాడు. మనిషి చావడానికి అనువైన స్థలాలన్నీ గాలిస్తున్నాడు.

కారు ఒక అందమైన బంగళాముందు ఆగింది. ఆ

బంగళాలోకి నడిచారిద్దరూ. బంగళాలో అందమైన యువతులు మరి కొందరున్నారు. వాళ్ళందర్నీ పరిచయం చేశాడు వర్మ. అందరూ చదువుకున్నవాళ్ళే. పెద్ద పెద్ద చదువులు చదివేరు. వాళ్ళందరూ అక్కడ ఎందుకు సమావేశమయ్యారో లక్ష్మీపతికి బోధపడలేదు. వర్మ చెప్పాడు.

'వీళ్ళంతా నీలాటి, నాలాటివాళ్ళే. నీలాగానే మునుపు మేమంతా ఆత్మహత్యలు చేసుకుందా మనుకున్నవాళ్ళమే. నిరుద్యోగం ఎంత భయంకరమో, మాకు అనుభవమే. కానీ, మేము తొందరపడి చావలేదు. చచ్చి ఏం సాధిస్తాం? మన చావులవల్ల సమాజానికి లాభం లేకపోయినా - నష్టం మాత్రం విపరీతం. మనల్ని ఈ అశాంతిలోకి తోసిన దుష్టశక్తుల్ని వెతికేం. సమాజంలో పేరుకుపోయిన కుళ్లు వ్యవస్థ భయంకరంగా కనిపించింది. దోపిడీ విధానం మమ్మల్నీ, మాలోని వేడీ - ఆవేశాలను ఛాలెంజి చేసింది. ఈ విధానం, ఈ వ్యవస్థమీద తిరుగుబాటు చేయాలనుకున్నాం. బుద్ధిబలం పనిచేయకపోతే భుజబలం - అవసరమైతే బులైట్ బలం - దేనికైనాసరే సిద్ధపడ్డాం. మాది ఏంగ్రీ యంగ్ మెన్ లీగ్. సంఘంలో అసమానతలూ, అశాంతినీ విప్లవాలద్వారా - రక్తపాతంద్వారా తొలిగించేందుకు మేము సిద్ధంగా వున్నాం. కమాన్ ఫ్రెండ్.... చెయ్యి కలుపు.

లక్ష్మీపతి చెయ్యి కలపలేదు. ఈ హింసాకాండకి నేను వ్యతిరేకి నన్నాడు. మనుషుల్ని చంపి మీరు స్థాపించబోయే రాజ్యం ఎవరికోసమన్నాడు. వాళ్ళందరి తొందరపాటుని దిద్ది అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

ఒక కుర్రాడు పిస్తోలు తీశాడు. కాలు ముందుకు వేస్తే కాలుస్తానన్నాడు. 'చెయ్యి కలపడమో, చావడమో నిర్ణయించుకోమన్నాడు. అంతేగాని తమ రహస్యం తెలుసుకుని వెళ్ళిపోయి బ్రతకడం వీల్లేదన్నాడు. అంతా విని లక్ష్మీపతి ఫకాలున నవ్వాడు. 'ఒరే పిచ్చీ' నేను చావడానికి నడుం కట్టిన మనిషిని. చావడమే నా ధ్యేయమని ఎలుగెత్తి అరుస్తున్న కుర్రాడ్ని. నా అంతట నేను చావలేకపోతున్నాను. నన్ను కాల్చి పుణ్యం కట్టుకుంటానంటే నేను వద్దంటానా ? కాల్చు అన్నాడు.

వర్మ కలుగజేసుకున్నాడు. ఇల్లాంటి పిరికిపందల్ని కాల్చి బులెట్ వృధాచేసుకోనడం అవివేకం అన్నాడు. పిస్తోళ్లున్నవి, కళ్లకు పొరలు కప్పిన కామందుల్ని తుద ముట్టించడానికే తప్ప - ఇల్లాంటి అమాయకపు వెధవల్ని కాల్చడానికి కాదన్నాడు. లక్ష్మీపతిని వెళ్ళిపొమ్మని అరిచాడు. లక్ష్మీపతి వెళ్ళిపోయాడు.

వీధుల్లో - చక్రవర్తి కనిపించిన ప్రతిమనిషినీ అడుగుతున్నాడు - ఎక్కడైనా, ఎవరైనా ఆత్మహత్య చేసుకున్నారా? అని. లక్ష్మీపతి పోలికలు చెప్పి అల్లాటి కుర్రాడ్ని చూసేరా అని అతని వింత ప్రశ్నలకు జనం ఎగతాళి చేస్తున్నారు. కొందరు తిట్టారుకూడాను.

క్లాక్ టవర్ అయిదుగంటలు కొట్టింది.

లక్ష్మీపతి తలెత్తి క్లాక్ టవర్ని చూశాడు. 'ఇంత వేగంగా గంటలు కొట్టే హక్కు నీ కెక్కడిది ? నన్ను ఓడించాలని చూస్తున్నావేమో, అది నీతరంగాదు, కొంచెం

తాపీగా కొట్టు. చావలేక చస్తున్నాను - మధ్య నీ అల్లరొకటా' అన్నాడు. అంతలో అతనికొక ఆలోచన తట్టింది. ఏ గంటల్ని లెక్కపెట్టుకుంటో చావడానికి ప్రయత్నిస్తాడో, ఆ గంట స్తంభం నెత్తికెక్కి దూకి చస్తే ....

ఈ ఆలోచన సబబుగా తోచింది. ఆ టవర్ వేపు నడుస్తున్నాడు. దూరంనుంచి చక్రవర్తి లక్ష్మీపతిని చూశాడు. 'లక్ష్మీపతీ' అని పిలిచాడు. కానీ, ఆ పిలుపు లక్ష్మీపతికి వినిపించలేదు.

లక్ష్మీపతి వేగంగా నడుస్తున్నాడు. చక్రవర్తి పరుగెడుతున్నాడు. కానీ, కార్లూ, బళ్ళూ, మనుషులూ అడ్డం పడటంవల్ల లక్ష్మీపతిని అందుకోలేకపోతున్నాడు.

లక్ష్మీపతి క్లాక్ టవర్ ఎక్కుతున్నాడు. చక్రవర్తి పరుగెత్తుతున్నాడు: అప్పటికే లక్ష్మీపతి చాలా ఎత్తు ఎక్కాడు. ఇంకా ఎక్కుతున్నాడు. చక్రవర్తి పరుగెత్తుకుంటూ వస్తున్నాడు. గట్టిగా పిలిచేందుకైనా నోరు పెగలడంలేదు. నోటిలోంచి మాట రాలేకపోతోంది. ఆయాసం అధికమవుతోంది. లక్ష్మీపతి ఏమవుతాడోనన్న ఆందోళన అతన్ని కలత పెడుతోంది.

ఉన్నట్టుండి జనమంతా ఒకేసారి కెవ్వుమని అరిచారు. చక్రవర్తి గుండెలు జారిపోయినాయి. అంతెత్తునుంచి కింద పడ్డ మనిషి బతకడం కష్టం! "అయ్యో! లక్ష్మీపతీ!" అనుకున్నాడు చక్రవర్తి.

అప్పటికే రక్తపు మడుగులో వున్న శవం చుట్టూతా మనుషులు చేరిపోయారు. వాళ్ళంతా "అయ్యో అయ్యో"

అని విచారాన్ని వెలిబుచ్చుతున్నారు. దడదడలాడే గుండెతో తడబడే నడకతో, తూలిపోతూ మూగిన జనాన్ని చేరుకుంటు న్నాడు చక్రవర్తి.

క్లాక్ టవర్ మీద నుంచి దూకింది లక్ష్మీపతి కాదు. అతనింకా క్లాక్ టవర్ ఎక్కుతూనే వున్నాడు. కిందనుంచి జనం హాహాకారాలు వినిపిస్తుంటే ఒకచోట ఆగి, కిందికి చూశాడు.

ఒక పెద్ద గుంపూ, గుంపు మధ్య శవం కనిపించడం లేదు. ఒకసారి కళ్ళు మూసుకున్నాడు లక్ష్మీపతి. "నాకంటె దౌర్భాగ్యులెవరోగాని, నాకంటె ముందు దూకి అదృష్టవంతు లయ్యారు. ఇప్పుడు, ఇల్లాంటి పరిస్థితుల్లో నేనూ దూకి, ఇక్కడే చచ్చేదానికంటె మరోచోట నా ప్రయత్నం నెర వేర్చుకోడం అన్నివిధాలా మంచిదని అతను క్లాక్ టవర్ దిగడం ప్రారంభించాడు.

గుంపుని చేత్తో తోసుకుంటూ శవాన్ని చూడటానికి వచ్చిన చక్రవర్తి, శవాన్ని చూసి 'సీతా' అని గావుకేక వేశాడు. ఆమె సీత! రక్తపుమడుగులో ప్రశాంతంగా నిద్ర పోతున్నట్టుంది. ఆ శవమ్మీద పడి ఘొల్లున ఏడుస్తున్నాడు చక్రవర్తి.

సీత చేతిలో ఒక ఉత్తరం వుంది. ఆ ఉత్తరం తీశా రెవరో.... ఉత్తరంలో తనది ఆత్మహత్య అని రాసుకుంది. జీవితమ్మీద విరక్తి కారణమన్నది. కొన్నాళ్ళపాటు తమతో పాటు బతికేందుకు అనుమతించిన ప్రతి సహృదయునకూ తన

ధన్యవాదాలన్నది. చక్రవర్తి యింకా కుళ్ళి కుళ్ళి ఏడుస్తూనే వున్నాడు.

లక్ష్మీపతి వేగంగా నడుస్తున్నాడు. నగరం చివరికి. చీకటిపడింది. రాత్రి ఎనిమిది గంటలు కొట్టింది నగరంలోని గడియారం. లాభంలేదు. కాలాన్ని వృధాగా గడపకూడదు ఆలస్యమైతే బ్రతకాలన్న ఆశ కలగొచ్చు. ఆపైన మళ్ళీ చచ్చేంత కష్టాలే.... ఈ రాత్రి తెల్లవారక మునుపే చావాలి. చావాలి....

లక్ష్మీపతి, ఒక నిర్జన ప్రదేశంలో వంతెనమీద కూచున్నాడు. మెడకి మఫ్లరుంది. ఆ మఫ్లర్ రెండు అంచులూ చేతుల్తో పట్టుకున్నాడు. మెడకి ముడి వేసుకోబోతున్నాడు.

అంతలో....

ఒక ఆడపిల్ల-కన్నెవయసు.... అమాయకమైన రూపు పేదరికానికి ప్రతిబింబం, అతని దగ్గిరకొచ్చి ఏవండీ! అన్నది. లక్ష్మీపతి ఉలిక్కిపడ్డాడు. మఫ్లర్తో మొహం తుడుచుకున్నాడు. 'ఏం కావాల'ని అడిగాడు.

పది రూపాయలు కావాలన్నది. ఆమె తల్లి చావు బతుకులమధ్య వున్నదన్నది. డాక్టరు మందులు రాశాడు. ఆ చీటీకూడా తన దగ్గరే వుంది. మందులు కొనే తాహతు మాత్రం లేదు. అందువల్ల వాళ్ళమ్మ చచ్చిపోవచ్చు. ఆమె చచ్చిపోతే తాను బతకడం కష్టం. ఇన్నేళ్లు అమ్మే పెంచి పెద్ద చేసింది. తానెవరో ఉద్ధరిస్తానన్న నమ్మకం కావచ్చు. కడుపుతీపి కావచ్చు. అన్ని ఆశలూ తనమీదే పెట్టుకుంది. ఇల్లాంటప్పుడు తల్లికి సాయపడవలసిన తాను,

ఆడపిల్ల - అశక్తురాలూ అయిపోయింది. దయగలవా రెవరైనా సాయం చేస్తారనే ఆశతో రోడ్డెక్కింది. ఒక్క పదిరూపాయలు !

లక్ష్మీపతి జాలిపడ్డాడు. తన దగ్గిర డబ్బు లేదన్నాడు. "కనీసం అప్పుగానైనా ఇవ్వండి. అమ్మ బతికింతర్వాత మీ అప్పు నయాపైసల్తో తీర్చేస్తాను" అన్నదా పిల్ల. నిజంగా తన దగ్గిర డబ్బు లేదన్నాడు. ఆ పిల్ల అతని మాట నమ్మలేదు.

అందువల్ల —

చివరి ఆయుధంగా ఆ పిల్ల తన శీలాన్ని బేరానికిపెట్టి ప్రాధేయపడింది. "ఎవరో ముక్కు మొహం తెలీని పిల్లను. డబ్బు తిరిగి ఇవ్వగలనో లేదోనన్న అనుమానం మీకుంటే- నన్ను....నన్ను పొందండి. దానికైనా నేను సిద్ధమే. కానీ, మా అమ్మ మాత్రం చావకూడదు" అని ఏడ్చిందా పిల్ల.

లక్ష్మీపతి పక్కలో బాంబు పడినట్టు ఉలిక్కి పడ్డాడు. తన నెవరో కొరడాతో ఛెళ్లున కొట్టినట్టు అయింది. ఇంకెవరు? సీత ! సీత సవాలు అతని గుండెల్ని తంతున్నట్టు మెలికలు తిరిగిపోయాడు. అతను అమాయకంగా ఆ పిల్లను కొన్ని ప్రశ్నలు అడిగాడు.

"నే నిప్పుడు డబ్బివ్వను. నువ్వు మరో మనిషిని డబ్బు అడుగుతావ్ ! అవునా ?"

"అవును."

"ఆ దుర్మార్గుడు నీకు డబ్బిచ్చి నిన్ను పాడు చేస్తాడు. అందుకు నువ్వు సిద్ధమేనా ?"

"ఏం చేస్తాను చెప్పండి - అమ్మకోసం తప్పదుగదా!"

"ఇంతకు మునుపు నువ్వు పాడు కాలేదా ?

"అమ్మ బతికున్నంత కాలమూ నాకా అవసరం రాదండీ!"

"అయ్యో! నీ కెల్లా చెప్పాలో తెలీడంలేదు. నీ నిర్ణయం మంచిది కాదమ్మాయ్. మహా పాపం!"

"పాపపుణ్యాలు లెక్క చూసుకోవడానికి టైంలేదండి చెప్పండి. డబ్బిస్తారా ? ఎవర్నయినా అడగమంటారా ?"

సీత నవ్వినట్టు అనిపించింది. తనని ఎగతాళి చేస్తున్నదా నవ్వు. తట్టుకోలేకపోయాడు. 'నేను ఓడిపోలేను సీతా! గెలుపు నాదే' అంటూ లేచాడు. ఆపిల్ల చేతిని పుచ్చుకున్నాడు.

"డబ్బు ఎవర్నీ అడక్కు. నేను తెస్తాను, నీకిస్తాను. మీ ఇల్లెక్కడో చూపించు, త్వరగా" అన్నాడు.

ఆ పిల్ల అతన్ని ఒక మురికివాడలోకి తీసుకెళ్ళింది. గంటస్థంభం తొమ్మిది గంటలు కొడుతోంది. ఆ మురికివాడలో, ఒక పాకలో ఆ పిల్ల తల్లి చావుబతుకుల మధ్య కొట్టుకుంటోంది. ఆపిల్ల, తల్లిమీదవాలి అంటోంది....

"అమ్మా ! దేవుడ్ని తీసుకొచ్చేనే! ఆయన నిన్ను బతికిస్తాట్ట.... నువ్వు బతుకుతావే అమ్మా !"

ఆ తల్లి రెండు చేతులూ జోడించింది. లక్ష్మీపతికి నమ

స్కారం చేసింది. లక్ష్మీపతి వణికిపోతున్నాడు. ఆ పిల్ల చేతిలో మందు చీటీ తీసుకున్నాడు. ఆమెతో అన్నాడు....

"నే నిప్పుడే వస్తాను. మందులు తీసుకొస్తాను. ఈ లోగా నువ్వు పాడుపని చెయ్యకు. ఎంత ఆలస్యమైనా నాకోసం ఎదురుచూడు."

ఆ పిల్ల అతని మాట లన్నింటికీ తలూపింది.

ఇప్పుడు లక్ష్మీపతి రిక్షా తొక్కుతున్నాడు. అతని రిక్షాలో ఒక ఆసామి కూర్చుని వున్నాడు. గడియారం పన్నెండు గంటలు కొడుతోంది. "భగవంతుడా! ఆరు కొట్ట నివ్వకు. ఆ పిల్ల ఆపదను ఆదుకునే అవకాశమివ్వు. ఆ తర్వాత, మృత్యుదేవతకు ఆశపెట్టాను గనక, నిశ్చింతగా చస్తాను. ఈ నిర్ణయంలో ఏ మాత్రం తభావతు జరిగినా సీత పందెం గెలుస్తుంది. నా ఓటమి చావుకంటె దారుణం. అది నే భరించలేను."

రిక్షా ఒక ఇంటిముందు ఆగింది. ఆసామి ఒకరూపాయి కాగితాన్నిచ్చి వెళ్ళిపోయాడు. ఆ కాగితం చూసుకున్నాడు. అది తనదే. దానిమీద దస్తూరి వుంది. 'చివర్రూపాయి—నిరుద్యోగి' అని నవ్వుకున్నాడు. ఆ మాట కొట్టేసి మరోపక్క రాసుకున్నాడు. "మొదటి రూపాయి-ఉద్యోగి" అని. అక్కడ్నుంచి అతను విజృంభించాడు. చాలామందిని రిక్షాలో మోశాడు. రిక్షా అద్దెపోను పరిరూపాయలు మిగిలాయి. రిక్షా యిచ్చేసి, మందులు కొని, మురికివాడవేపు పరిగెత్తాడు.

మూడు గంటలు కొడుతోంది గడియారం. పరుగు

వేగం పెంచాడు. చివరికి ఆ పాకను చేరుకున్నాడు. ఒక్క గెంతులో పాకలోకి అడుగుపెట్టాడు.

చిత్రం!

ఇప్పుడా పాకలో పిల్లగానీ, ఆ పిల్ల తల్లిగానీ ఎవరూ లేరు. అతనికి పిచ్చెక్కినట్టయింది. సీత సవాలు మళ్ళా గుర్తొస్తోంది. వణికిపోతున్నాడు. పాక బయటకువచ్చి నిలబడ్డాడు. అక్కడ కనిపించిన ఒక మనిషిని పాకలో వాళ్ళ గురించి అడిగాడు. అతను చెప్పాడు. ఆ తల్లి చచ్చిపోయిందట. శవాన్ని మున్సిపాలిటీవాళ్ళు తీసుకెళ్ళారుట. దుర్గ ఆపిల్ల పేరుట. శ్మశానానికి వెళ్ళిందో, గుండె జారిపోయి చావడానికి వెళ్ళిందో తెలీదన్నాడు.

వింటున్న అతని కాలికింద భూమి కంపిస్తున్నట్టయింది. దుర్గా, దుర్గ తల్లి తనమీద పెట్టుకున్న 'ఆశ' గుర్తుకొచ్చింది. దుర్గ-తనని తల్లికి దేవుడిగా పరిచయం చేసిన మాటా, ఆతల్లి కళ్ళల్లో వెలిసిన ఆనందమూ, ఆమె చేతులు జోడించిన తీరూ- అన్నీ జ్ఞాపకానికొస్తున్నాయి. మరోపక్క- సీత ఎగతాళి! "నీలాటి అప్రయోజకుడ్ని నమ్ముకుని, నీ మాటకి కట్టుబడి, దుర్గ ఎవర్నీ డబ్బడగలేదు. చివరి క్షణం వరకూ వాళ్లు నిన్నే నమ్ముకున్నారు. చివరికి సమయానికి మందులేక ఆ తల్లి చచ్చిపోయింది. అంటే-నువ్వే ఆమెను చంపావు దుర్గ నిర్ణయం నువ్వు ఆమోదించకపోయినా, ఆమోదించే మనుషులు అనేకమంది వున్నారు. ఆ ధర్మాత్ములు దుర్గని పాడుచేసినా, వాళ్ళ సహాయంతో దుర్గ తల్లి బతికేది. ఆ తల్లి పోయింతర్వాత దుర్గ గతేమిటి? చావనైనా చస్తుంది....

లేదూ, కాలుజారి నాలాగా పడినా పడుతుంది - మురికికూపం లోకి! ఇద్దర్ని చంపిన లక్ష్మీపతి.... నీతీ నిజాయితీ గాలికి పెరగవోయ్. అవన్నీ వట్టిమాటలు. కేవలం అవే మనిషిని బతికించవు....

లక్ష్మీపతి చలించాడు. వీల్లేదు. దుర్గ పాడవడానిగ్గానీ, చచ్చిపోవడానిగ్గానీ వీల్లేదు. ఎక్కడున్నా దుర్గను వెతికి పట్టు కుంటాను. నా ఛాలెంజ్‌ని నిలబెట్టుకుంటాను దుర్గా!" అని పిచ్చికేక పెట్టి శ్మశానంవేపు పెరుగెత్తుతున్నాడు.

గంట స్థంభం నాలుగ్గంటలు కొట్టింది: "అయ్యో.... టైం అయిపోతుంది.... రెండు గంటలే.... ఈలోగా దుర్గ కలుస్తే బావుండు," అనుకుని దుర్గా! దుర్గా! అని పిలుస్తో పరుగెత్తుతున్నాడు.

దూరంగా శ్మశానం కనిపిస్తోంది. ఒక శవం తగుల బడుతోంది. ఆ మంటల వెల్తుర్లో ఒక మనిషి చెట్టుని ఆనుకు నిలబడినట్టు పసిగట్టాడు. అది చూడగానే లక్ష్మీపతి కళ్ళు మెరిశాయి. 'దుర్గా' అంటూ పిలుస్తూ వేగంగా పరు గెత్తి ఆ మనిషిని కావిలించుకున్నాడు.

ఆ మనిషి దుర్గ కాదు! చక్రవర్తి!

చక్రవర్తి కన్నీటిని తుడుచుకుని లక్ష్మీపతి వేపు చూసేడు. 'నువ్వా' అన్నాడు లక్ష్మీపతి. "ఎందుకిక్కడ నిలబడ్డావు చక్రవర్తీ? ఆ కాలుతున్న దెవరు?"అని అడిగాడు. చక్రవర్తి గొంతు పూడుకుపోతుండగా చెప్పాడు 'సీత! నా సీత లక్ష్మీపతీ!'

లక్ష్మీపతి అవాక్కయిపోయాడు. చక్రవర్తి ఆమె

ఆత్మహత్య గురించి చెప్పాడు. ఆ తర్వాత ఆవేశంగా అన్నాడు - 'లక్ష్మీపతీ! సీత ఆత్మహత్యకు కారణం నేనురా! నేను!' అనాడు. నా సానుభూతి సీతకు తెలీజేసి, ఆదరిస్తే సీత బతికుండేది!"

లక్ష్మీపతికి కన్నీళ్లుబికాయి. సీత ఆత్మహత్యకి నేనూ ఒక కారణమే. ముఖ్యమైన కారణం నా నోటి తొందరే! సీతక్కా- 'నన్ను క్షమించవూ!' అన్నాడు.

ఆ వెలిగే మంటల్లో సీత బొమ్మ లక్ష్మీపతికి కనిపించింది. మూర్తీభవించిన శోకదేవతలావుంది. 'చాలా ఆలస్యంగా నన్ను అక్కా- అని పిలిచేవు తమ్ముడూ! చాలా ఆలస్యంగా నీ సానుభూతి అందింది. ఇప్పుడు నువ్వు త్వరబడకపోతే మరో ప్రాణినికూడా బలిచేస్తావు. దుర్గ! దుర్గని ఆదుకో. వెళ్ళు' అన్నది.

లక్ష్మీపతి 'దుర్గా' అని పిచ్చెత్తినట్టు అరిచేడు. అక్కడ్నుంచి పరుగెత్తబోయేడు. చక్రవర్తి లక్ష్మీపతిని పట్టుకున్నాడు. "దేవుడు నా రెండు కళ్ళనీ పొడిచేశాడను కున్నాను. కాని, అల్లా కాలేదు. కనీసం నువ్వైనా కనిపించేవు. అదే పదివేలు. ఏ అఘాయిత్యం చేసుకోవద్దు. నీ మనసు పాడుచేసుకోకు. ఆగిపో!" అన్నాడు.

లక్ష్మీపతి ఆవేశంగా చెప్పినా ఖచ్చితంగా అన్నాడు.

"నా గురించి దిగులు పడకు. నన్ను ఆపకు చక్రవర్తీ! దుర్గ — ఒక అభాగ్యురాలు — ఆమెను ఆదుకోవాలి. ఇప్పటికే—ఇద్దర్ని చంపుకున్నాను .... నన్ను వెళ్ళనీ" అని అక్కడ్నుంచి పరుగెత్తేడు.

దుర్గకోసం లక్ష్మీపతి వెతుకుతూనేవున్నాడు. ఎక్కడా కనిపించలేదు. గంటస్థంభం అయిదు గంటలు కొట్టింది. "నేను ఓడిపోయేను సీతక్కా! నువ్వే గెలిచావు. దుర్గ నాకు కనుపించదు. ఎక్కడో తనువు చాలించి వుంటుంది. తేరుకోలేక పోయేడు. దుర్గ కనిపిస్తే బతుకుదా మనుకున్నాను. నన్ను నమ్ముకున్న వాళ్ళందర్నీ చంపుకున్న తర్వాత, నేనెవరికోసం బతకాలి? అదుగో ఆరుకూడా కావస్తోంది .... నా ముహూర్తం దగ్గిర పడుతోంది ఈ అశక్తుడ్ని, అప్రయోజకుడ్ని మన్నించు సీతక్కా!" అంటూ అతను రైలు పట్టాల మీదకు నడుస్తున్నాడు.

దూరంగా రైలు వస్తున్న శబ్దమైంది. లక్ష్మీపతి రైలు పట్టాలమీదకు తల పెట్టేడు. ఛుక్ .... ఛుక్ .... ఛుక్ మని శబ్దం వినిపిస్తోంది. ఊపిరి బిగపెట్టేడు. రైలు వస్తున్న దిక్కువేపు చూస్తున్నాడు.

చూస్తున్నవాడల్లా అకస్మాత్తుగా లేచి నుంచున్నాడు. అతని కొంచెం దూరంలో దుర్గ రైలు పట్టాలెక్కి రైలు వస్తున్నవేపు నడుస్తోంది. దుర్గా! అని పిలిచి ఆమెవేపు పరుగెత్తాడు.

రైలు వస్తోంది. రైలువేపు దుర్గ పరుగెత్తుతోంది. లక్ష్మీపతి దుర్గను అందుకోడానికి పరుగెత్తుతున్నాడు. క్షణంలో దుర్గ రైలుకింద పడివుండేది. కానీ, లక్ష్మీపతి దుర్గను పక్కకు లాగేడు.

రైలు వెళ్ళిపోయింది. దుర్గ-లక్ష్మీపతి ఒడిలో వుంది. దుర్గ ఏడుస్తోంది. లక్ష్మీపతి దుర్గతో అంటున్నాడు.

'నువ్వు చావడానికి వీల్లేదు. బ్రతకాలి. నాతో పాటు బ్రతకాలి. నీతక్కకి మాటిచ్చేను దుర్గా! అందుకోసమైనా నువ్వు బతకాలి. నీతో బాటు నేనూ బతుకుతాను."

గంట స్థంభం ఆరు గంటలు కొట్టింది. కొత్తసూర్యుడు ఉదయించేడు. నడి బజార్లో రిక్షా నడుస్తోంది. రిక్షాలో దుర్గ కూర్చుని వుంది. లక్ష్మీపతి రిక్షా తొక్కుతున్నాడు.

ఇప్పుడతనికి ఎలా బ్రతకాలా అన్న సమస్య లేదు. ఉద్యోగం రాలేదని దిగులు లేదు.

చదువుకో.... చదువు కేవలం ఉద్యోగంకోసం కాదు - విజ్ఞానంకోసం.... ఉద్యోగం రాలేదని దిగులుపడకు. నిరాశతో నీతికి నీళ్ళొదిలి దోపిడీ, దొంగతనాలకు గానీ- వ్యభిచారానికి గానీ తలొంచకు. జాతిని హీనపరచకు. శ్రమజీవనం వర ప్రసాదం. నీ రెక్కల కష్టమే నీకు శ్రీరామ రక్ష.

ఈ జీవిత సత్యాన్ని తన మిత్రులకు చెప్పడానికి లక్ష్మీపతి పాడుకుంటో వేగంగా రిక్షా తొక్కుతున్నాడు. గంట స్థంభం గంటలు కొడుతోంది. ఇప్పు డతనికి ఆ గంటలు ప్రగతి మార్గంలో జేగంటల్లా వినిపిస్తున్నాయి.

- శుభం. -